
సాక్షి 24|7
విశాఖ సిటీ
గురువారం 24-8-2017



మట్టి గణపతికి నృత్యహారతి

పర్యావరణహిత మట్టి గణపతికి గట్టి మద్దతు లభిస్తోంది. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసే విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుందని.. అందువల్ల ఈ వినాయక చవితికి మట్టి గణపతినే పూజించాలని అవగాహన కల్పిస్తూ పలు సంస్థలు నృత్య ప్రదర్శనలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో ప్రజలు కూడా వాటివైపే మొగ్గు చూపుతున్నారు.

సెంటర్‌స్ప్రెడ్‌లో..



మలి ప్యాకేజీలోనూ మడతే!

2లో ▶

ఒకటో ప్యాకేజీని అచ్చంగా తెలుగుదేశం నాయకుడి సంస్థకే కట్టబెట్టేశారు..

ఇప్పుడు రెండో ప్యాకేజీ వంతొచ్చింది.. దీన్నీ మడతెట్టేస్తున్నారు..

అదీ వేరెవరికోకాదు.. రాష్ట్ర ప్రభుత్వ కీలకనేతకు సన్నిహితమైన.. రాష్ట్రంలో అనేక భారీ ప్రాజెక్టులను చేజిక్కించుకున్న.. ముంబైకి చెందిన ఓ బడా సంస్థకు కట్టబెట్టేందుకు దాదాపు రంగం సిద్ధమైంది..

ఇదీ విశాఖ భూగర్భ విద్యుత్ కేబుల్ ప్రాజెక్టులో టెండర్ల దశలోనే జరుగుతున్న గోల్‌మాల్..

రూ.225 కోట్ల ప్యాకేజీ-1 పనులను ఎల్-1 సంస్థకు కాకుండా ఎల్-2కు ఖరారు చేయగా..

రూ.222 కోట్ల ప్యాకేజీ-2 పనులను సైతం ఎల్-1 కంటే రూ.22 కోట్లు ఎక్కువ కోట్ చేసిన ఎల్-2కు ధారాదత్తం చేయాలని సిఫారసు చేశారు..

ఈ రెండు ప్యాకేజీల్లోనూ ఎల్-2గా ఉన్న సంస్థలు అధికార టీడీపీ నేతలకు చెందిన.. వారికి సన్నిహితంగా ఉన్న కాంట్రాక్టు సంస్థలే కావడం గమనార్హం.

టెండర్ల దశలోనే కోట్లకు కోట్లు కన్నం పెట్టే ప్రయత్నాలు జరుగుతుంటే.. ఇక పనులు ఏ రీతిలో జరుగుతాయో వేరే చెప్పనక్కర్లేదు.

- సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

- భూగర్భ విద్యుత్ కేబుల్ ప్రాజెక్టులో మరో చీకటి కోణం
- రెండో ప్యాకేజీ పనులనూ ఎల్-2 సంస్థకు ఇవ్వాలని సిఫారసు
- ప్రభుత్వంలో కీలకనేతకు అది సన్నిహిత సంస్థ
- ఎల్-1 కంటే రూ.22 కోట్లు ఎక్కువ కోట్ చేసినా ఓకే
- ప్యాకేజీ-1 మాదిరిగానే ఇక్కడా ఒడిశా సంస్థకు చేదు అనుభవం
- టెక్నికల్, ప్రైస్ బిడ్లు తెరిచిన తర్వాత బ్లాక్‌లిస్టు సాకు
- ఇది నిబంధనలకు విరుద్ధమంటున్న నిపుణులు

ఇళ్ల కుంభకోణంలో 13 మందికి రిమాండ్



- 36 మంది దళారుల ద్వారా రూ.2.91 కోట్లు వసూలు చేసిన మాజీ ఏపీడీ
- నకిలీ డాక్యుమెంట్లతో ఇళ్ల కేటాయింపు

5

వర్షాలు కుమ్మేస్తాయ్!

నేడు, రేపు అప్రమత్తం



గత కొన్నాళ్లుగా భారీ వర్షాలు కురుస్తాయని ఏరోజు కారోజు వాతావరణ శాఖ పేర్కొంటున్నా.. ఇప్పటిదాకా భారీ వర్షం కురిసింది లేదు. కానీ గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అందిన వాతావరణ సూచనలు జిల్లా కలెక్టర్‌కు నమ్మకం కలిగించాయేమో!.. అధికారులను, తీరప్రాంత మండలాలను అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

12

సిట్ కోరల్లో కబ్జాకోరులు

- 14 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు
- ఆరుగురు ప్రైవేట్ వ్యక్తులపై క్రిమినల్ కేసులు
- పలువురు అధికారులపై శాఖపరమైన దర్యాప్తు

సిట్ వల విస్తరిస్తున్న కొద్దీ బడా అవినీతి చేపలు అందులో చిక్కుకొని విలవిల్లాడుతున్నాయి.

రికార్డుల ట్యాంపరింగ్, భూ కబ్జాలపై విచారణ జరుపుతున్న సిట్.. ఆర్జీల వారీగా దర్యాప్తు జరుపుతూ నిందితులపై చర్యలకు సిఫారసు చేస్తోంది.



భూ కబ్జాల బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిట్ సభ్యులు(ఫైల్)

వాటి ఆధారంగా జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తోంది.. ఇప్పటివరకు 60 కేసుల్లో సిఫారసులతో కూడిన నివేదికలు జిల్లా కలెక్టర్‌కు అందించింది.

వాటిలో 42 కేసుల్లో చర్యలు ప్రారంభమయ్యాయి.. 14మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పలువురు ప్రైవేట్ వ్యక్తులపై క్రిమినల్ కేసులు.. మరికొన్నింటిలో శాఖాపరమైన దర్యాప్తులు ఆదేశాలు జారీ అయ్యాయి. కేసుల వారీగా సిట్ సిఫారసులు.. వాటిపై ఉన్నతాధికారులు చేపడుతున్న చర్యలకు సంబంధించి 'సాక్షి' సేకరించిన ఎక్స్‌క్లూజివ్ సమాచారం...

– సాక్షి, విశాఖపట్నం

2

అందమే ఐశ్వర్యం



బీచ్‌రోడ్డులోని సింఫనీ హాలులో బుధవారం ప్రారంభమైన సంప్రదాయ చీరల ప్రదర్శనను వర్ధమాన సినీనటి ఐశ్వర్య ప్రారంభించింది.

20



సిట్ కోరల్లో కబ్జాకోరులు

- సిట్ ఉచ్చులో అవినీతి అధికారులు
- వెలుగులోకి వస్తున్న భూ కబ్జా లీలలు
- ఆరుగురు ప్రైవేటు వ్యక్తులపై క్రిమినల్ కేసులు
- తప్పించుకునేందుకు టీడీపీ పెద్దల ఎత్తులు

సాక్షి, విశాఖపట్నం:

కంచే చేను మేసినట్టు ప్రభుత్వ భూములకు సంరక్షకులుగా వ్యవహరించాల్సిన అధికారులే అక్రమార్కులతో కలిసి కబ్జా చేశారు. అంతేకాదు వందల కోట్ల విలువైన ప్రైవేటు భూములకు తప్పుడు రికార్డులు సృష్టించి రాబందుల పాల్జేసేందుకు సహకరించారు. రికార్డులను ట్యాంపరింగ్ చేసి దర్జాగా కబ్జా చేశారు. సిట్ విచారణతో అవినీతి అధికారులు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. మరోపక్క వీరి వెనుక ఉండి నడిపించిన టీడీపీ పెద్దలు సిట్ ఉచ్చులో పడకుండా తప్పించుకునేందుకు ఎత్తులు వేస్తున్నట్టు తెలుస్తోంది.

14 మంది తహసీల్దార్లకు షోకాజ్‌లు

కలుగులో ఎలుకల్లా అవినీతి అధికారులు ఒక్కొక్కరుగా బయటికొస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 60 కేసుల్లో తీసుకోవల్సిన చర్యలపై సిట్ జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేసింది. వీటిలో 42 కేసుల్లో సిట్ ఆదేశాల మేరకు 14 మంది తహసీ ల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో ముగ్గురు మాజీ తహసీల్దార్లు కూడా ఉన్నారు. అదే విధంగా ముగ్గురు డెప్యూటీ తహసీల్దార్లు, ఐదుగురు వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివిధ కేసుల్లో జరిగిన అవకతవకలపై 33 మంది తహసీల్దార్ల నుంచి నివేదికలు కోరారు. ఆరుగురు ప్రైవేటు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, మరో ఆరు కేసుల్లో డెప్యూటీ కలెక్టర్లతో డిపార్టుమెంటల్ ఎంక్వైరీకి ఆదేశించారు.

1బి రికార్డునే ట్యాంపర్ చేశారు..

చినవాల్తేరుకు చెందిన జి.నాగమణిబాబు 2003లో పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామంలో సర్వే నెం. 91/8లో 10 ఎకరాలను కొనుగోలు చేశారు. కానీ కొంత మంది వ్యక్తులు 1 బి రిజిస్టర్‌ను ట్యాంపర్ చేశారు. ఈ 10 ఎకరాలతో పాటు పక్కనే ఉన్న మరో 8.52 ఎకరాలను కలిపి మొత్తం 18.52 ఎకరాలను దేవగుప్త పేర్రాజు, దేవగుప్త రామచంద్రరావులతో పాటు మరో ఇద్దరు వ్యక్తుల పేరిట ట్యాంపర్ చేశారు. ఏపీ ఇనాం ద్వారా తమకు సంక్రమించినట్టుగా చెబుతూ పట్టాల మంజూరు కోసం దరఖాస్తు చేశారు. అప్పటి తహసీల్దార్ సైతం ఈ వ్యవహారంపై పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 190/2014 కింద కేసు కూడా నమోదు చేశారు.

చర్యలు:– రెవెన్యూ రికార్డు ఫైల్ 631/2010 గల్లంతు చేసిన వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ సిట్ సిఫార్సు చేసింది. డిజిటల్ కీని మాయం చేయడం, ఉద్దేశ పూర్వకంగా దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్‌పై విచారణ జరపాలని ఆదేశించారు. డీకేఎస్ దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలకు ఉపక్రమించారు.

రికార్డుల్లో ఏకంగా పేర్లే మార్చేశారు..

ఆనందపురం మండలం తుర్లవాడలో సర్వే నెం.10లో చిక్కాల నాయుడు 1991లో ఎకరం భూమి కొనుగోలు చేసి పట్టాదార్ పాస్‌పుస్తకం పొందారు. తహసీల్దార్ స్థానికులతో కుమ్మక్కై రెవెన్యూ రికార్డుల్లో నాయుడు పేరును తొలగించి తత్రాజు ఆదినారాయణ పేరు చేర్చారు. పట్టాదార్ పాస్ పుస్తకాన్ని కూడా జారీ చేశారు.

చర్యలు:– సివిల్ సూట్ నిబంధనలను అనుసరించి పట్టాదార్ పాస్ పుస్తకాలను రద్దు చేయాలని సిట్ ఆదేశించింది.

అంతేకాకుండా అప్పటి వీఆర్వో, తహసీల్దార్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సూచించింది. టి.ఆదినారాయణలతోపాటు మిగిలిన ప్రైవేటు వ్యక్తులను కూడా గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. తహసీల్దార్ ఎస్‌వి అంబేద్కర్‌తో పాటు తుర్లవాడ వీఆర్వో డి.వేణులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

తనకు ఇవ్వలేదన్న అక్కసుతో..

విజయవాడకు చెందిన సోమురౌతు ఆనందనాగరాజు అనే వ్యక్తి అగనంపూడిలో సర్వే నెం.49/3లో 50 సెంట్ల స్థలాన్ని 1997లో అనకాపల్లికి చెందిన కొల్లూరు కోమల నుంచి కొనుగోలు చేశాడు. ఆ భూమిపై కన్నేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములునాయుడు తనకు ఇచ్చేయాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. అందుకు ఆనందనాగరాజు తిరస్కరించడంతో అవి ప్రభుత్వ భూములంటూ రికార్డులు చూపించి అందులోఉన్న షెడ్లను తొలగించాడు. అనకాపల్లి కోర్టు నుంచి ఇంటిరం ఆర్డర్ తీసుకొచ్చాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక బాధితుడు సిట్‌ను ఆశ్రయించాడు.

చర్యలు:– వివాదం కోర్టులో ఉండడంతో సర్వే నెం.49లో ఉన్న భూమి ప్రభుత్వానికి చెందినదా? కాదా ? సమగ్ర విచారణ జరపాలని సిట్ ఆదేశించింది. సిట్ ఆదేశాల మేరకు పూర్తి నివేదిక ఇవ్వాలని గాజువాక తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

గణేష్‌కు లైడిటెక్టర్ పరీక్ష ?

ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జీవీఎల్ గణేశ్వరరావు పోలీస్ కస్టడీ గురువారంతో ముగియనుంది. విచారణలో ఆయన ఏం సమాచారం చెప్పారన్న దానిపై ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఐదు రోజులపాటు గణేష్‌ను విచారించినప్పటికీ ఆయన నుంచి ఆశించిన స్థాయిలో సమాచారాన్ని రాబట్టలేకపోయారని తెలియవచ్చింది. ప్రతి ప్రశ్నకు 'కాదు, లేదు.. నాకు సంబంధం లేదు, కొంతమంది కావాలనే నన్ను ఇరికిస్తున్నా'రన్న ధోరణిలోనే సమాధానాలు చెప్పినట్టుగా తెలిసింది. ట్యాంపరింగ్ కేసులో కీలక నిందితుడైన గణేష్ వద్ద కచ్చితమైన సమాచారం ఉందని భావిస్తున్న సిట్ పోలీసులు ఎలాగైనా అతని నుంచి ఆ సమాచారాన్ని రాబట్టేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గణేష్‌ను లై డిటెక్టర్ పరీక్షకు అనుమతి కోరుతూ ఒకటి రెండ్రోజుల్లో కోర్టులో పిటిషన్ వేసే అవకాశాలున్నట్టుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కోర్టు అందుకు అనుమతిస్తే మరో వారం రోజులపాటు కస్టడీని పొడిగించే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు.

ఎన్నాళ్లీ నేలబారు చదువులు?

సాక్షి, విశాఖపట్నం: ఓ పక్క వందల కోట్లు ఖర్చు చేసి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ ప్రభుత్వమే కాదు.. జిల్లాలని అధికార పార్టీకి చెందిన మంత్రులూ, ఎమ్మెల్యేలూ గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ అవసరమై న చోట కల్పించకుండా.. అనవసరమైన చోట్ల దుబారా చేస్తోందనడానికి చీడికాడ మండలం కండివరం జెడ్పీ హైస్కూలే ఉదాహరణ. ఈ హైస్కూల్‌లో ఉన్న తరగతి గదులు 9, 10 తరగతుల విద్యార్థులకే సరిపోతుండడంతో 6,7,8 తరగతులకు చెందిన సుమారు వందమంది విద్యార్థులు రోజూ ఆరుబయటే మట్టినేలపైనే కూర్చొని చదువు కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అదనపు తరగతి గదులు కోసం స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. హైస్కూల్‌లో విద్యార్థులెదుర్కొంటున్న దుస్థితిని బుధవారం నాటి జెడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ స్థానిక జెడ్పీటీసీ పి.సత్యవతి వివరించారు.

మలి ప్యాకేజీలోనూ మడతే!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.890 కోట్ల భారీ ప్రాజెక్టు పనులను ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా చేపట్టాల్సిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు టెండర్ల దశలోనే వివాదాలకు, ఆరోపణలకు తావిస్తున్నారు. కనీస ధరకు పనులు చేస్తామని ముందుకొచ్చిన సంస్థను సాకులతో పక్కన పెట్టి దాని కంటే ఎక్కువ కోట్ చేసిన కంపెనీలకు పనులు ధారాదత్తం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్యాకేజీ–1 రూటులోనే ప్యాకేజీ–2

విశాఖ నగరంలో చేపట్టనున్న భూగర్భ విద్యుత్ కేబుల్ ప్రాజెక్టు ప్యాకేజీ–2 పనుల అప్పగింతలోనూ ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఇప్పటికే ప్యాకేజీ–1 పనులను తక్కువ రేటు కోట్ చేసిన ఒడిశాకు చెందిన గుప్తా ఇన్‌ఫ్రా(ఎల్–1) సంస్థకు కాకుండా దాని కంటే రూ.19 కోట్లు ఎక్కువ కోట్ చేసిన టీడీపీ నేతకు చెందిన సంస్థ (ఎల్–2)కు కట్టబెట్టడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. కాగా. ప్యాకేజీ–2 టెండర్లలోనూ ఇదేతరహా కుమ్మక్కు వ్యవహారం వెలుగు చూస్తోంది. రూ.890 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడుతున్న భూగర్భ కేబుల్ ప్రాజెక్టు పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించిన సంగతి తెలిసిందే. ప్యాకేజీ–2 పనులకు రూ.222 కోట్లతో అంచనాతో టెండర్లు ఆహ్వానించగా.. ఒడిశాకు చెందిన గుప్తా ఇన్‌ఫ్రా సంస్థ అదే మొత్తానికి బిడ్ వేసి ఎల్–1గా నిలిచింది. రూ.244 కోట్లతో బిడ్ వేసిన ముంబైకి చెందిన బడా సంస్థ ఎల్–2గా నిలిచింది. నిబంధనల ప్రకారం ఒడిశాకు చెందిన సంస్థకే ప్యాకేజీ–2 పనులు అప్పగించాలి. కానీ ఈపీడీసీఎల్ అధికారులు ఇక్కడ కూడా తక్కువకు కోట్ చేసిన సంస్థ కంటే రూ.22 కోట్లు ఎక్కువ కోట్ చేసిన ఎల్–2 సంస్థకే కాంట్రాక్టు అప్పజెప్పాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

బ్లాక్‌లిస్ట్ అన్నది కుంటి సాకే

ఇంకా టెండర్ ఖరారు కాకపోయినా.. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఎల్–2గా ఉన్న ముంబై కంపెనీకే కట్టబెట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ కూడా ప్యాకేజీ–1 తరహాలోనే గుప్తా సంస్థను ఆరోపణలున్నాయన్న సాకుతోనే పక్కన పెట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. కాంట్రాక్టు సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టడమన్నది సర్వ సాధారణం. పనులు సకాలంలో పూర్తి చేయకపోయినా, లోపాలున్నా.. సదరు సంస్థలను బ్లాక్ లిస్టులో పెడతారు. అయితే దానికీ ఒక కాలపరిమితి ఉంటుంది. అది దాటితే ఒక బ్లాక్ లిస్ట్ వర్తించదు. ఒకవేళ కాలపరిమితి ముగియలేదనుకున్నా.. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న సంస్థను టెక్నికల్ బిడ్ పరిశీలనలోనే తొలగించాలని నిపుణులు అంటున్నారు. కానీ భూగర్భ కేబుల్ ప్రాజెక్టు విషయంలో మొదటిస్థానంలో ఉన్న ఒడిశా సంస్థ టెక్నికల్ బిడ్‌ను దాటి.. ప్రైస్ బిడ్ వరకు ఎలా వచ్చిందన్నదానిపై అధికారుల వద్ద సరైన సమాధానమే లేదు.

ఏదైనా జరిగితే ఆ కమిటీనే బలి

కాంట్రాక్టులు కట్టబెట్టే విషయంలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న ఉన్నతాధికారులు వ్యూహాత్మంగానే ముందు జాగ్రత్తలు చేపట్టినట్టు తెలుస్తోంది. ప్యాకేజీ–1 పనులను గుప్తా ఇన్‌ఫ్రాకు కట్టబెట్టొచ్చంటూ లీగల్ ఆఫీసర్‌తో సైతం లిఖితపూర్వకంగా రాయించి.. ఆ తర్వాత టీడీపీ నేతకు చెందిన సంస్థకు ధారాదత్తం చేయడం, ప్యాకేజీ–2 పనులను ఏకపక్షంగా ఎల్–2కి అప్పగించాలని సిఫారసు చేయడం తదితర పరిణామాలన్నీ ఎప్పటికైనా ఉన్నతాధికారులను ఇబ్బంది పెట్టేవే.. అందుకే సదరు అధికారులు ఈ నిర్ణయాలకు సంబంధించిన పత్రాలపై తాము సంతకం పెట్టకుండా ఐదుగురు కిందిస్థాయి అధికారులతో కమిటీ వేసి... ఆ కమిటీ సిఫార్సుల మేరకే ఆయా సంస్థలకు కాంట్రాక్టు కట్టబెట్టొచ్చంటూ సిఫారసు చేయిస్తూ వరల్డ్ బ్యాంకుకు నివేదికలు పంపినట్టు తెలుస్తోంది.

మూడు నెలల శిక్షణతో వైద్యమా?

- జీవో 465 ఉపసంహరించుకోవాలి
- లేకుంటే కోర్టును ఆశ్రయిస్తాం
- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి శర్మ

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణం): ప్రభుత్వం విడుదల చేసిన జీవో 465ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ ఎం.ఎస్.శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.విజయశేఖర్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంబీబీఎస్ ఆరేళ్లు చదవాలని, ప్రొఫెషనల్ కావాలంటే మరో ఆరేళ్లు కష్టపడితేనే ఒక డాక్టర్‌గా సమాజానికి సేవలందించిన వారమవుతామని చెప్పారు. అలాంటిది వైద్యరంగంపై సరైన అవగాహన లేని రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపీ), ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీ)కు మూడు నెలలపాటు శిక్షణనిచ్చి, సర్టిఫికెట్ అందజేసి వారిని రోడ్లపైకి వదలడం తగదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటువంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను ఐఎంఏ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఎంబీబీఎస్ వైద్యులెవరూ గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లడం లేదన్న కుంటిసాకు సరైంది కాదన్నారు. ఆయా ప్రాంతాల్లో సరైన మౌలిక వసతులు కల్పిస్తే ఎందుకు వెళ్లరో చెప్పాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణనిచ్చే కన్నా, ఏఎన్ఎం ఎంపీహెచ్‌డబ్ల్యూలకు, నర్సులకు శిక్షణనిచ్చి గౌరవ వేతనం పెంచాలని సూచించారు. సమావేశంలో ఐఎంఏ విశాఖ శాఖ కోశాధికారి పి.జె.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఐ.వాణి పాల్గొన్నారు.

26 నుంచి కన్యాశుల్కం జాతీయ ఉత్సవాలు

- విశాఖ, విజయనగరంలలో నిర్వహణ
- వివిధ భాషల రచయితలు, సాహితీవేత్తలతో సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న రామతీర్థ

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): మహాకవి గురజాడ రచించిన విశిష్ట నాటకం కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో నిర్వహించనున్నట్టు మొజాయిక్ సాహిత్య సంస్థ కన్వీనర్ రామతీర్థ, ప్రతినిధి జగద్ధాత్రి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో, మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహణలో కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ సదస్సును సమున్నత రీతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న ఏయూ ప్లాటినం జూబ్లీ హాల్లో ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమయ్యే తొలి సెషన్‌లో దేశమును ప్రేమించుమన్నా..ప్రత్యేక కార్యక్రమం, ఒరియా–తెలుగు సాహితీ అనుబంధంపై తులనాత్మక పత్రం, సదస్సు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే రెండో సెషన్‌లో గుజరాతీ–తెలుగు సాహితీ సంబంధాలపై తులనాత్మక పత్రం, కన్నడ–తెలుగు సాహిత్యం పరిశీలన, యువ స్వరాలు, జెండాపై గురజాడ–సాంస్కృతికాంజలి ఆవిష్కరణ సభ, రచయిత స్పందన అనంతరం వంగపండు ప్రసాదరావు బృందం నేతృత్వంలో 'జెండాపై గురజాడ', కన్యాశుల్క జానపదం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండో రోజైన ఆదివారం ఏయూ ప్లాటినం జూబ్లీహాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి బెంగాలీ– తెలుగు సాహిత్యంపై సదస్సు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి అస్సామీ–తెలుగు సాహిత్యంపై తులనాత్మక చర్చ, అనంతరం సాహితీ సాంస్కృతిక రంగాల్లో సేవలందించిన వారికి సత్కారం ఉంటాయని తెలిపారు. సాయంత్రం ఐదున్నర నుంచి మొజాయిక్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 'కన్యాశుల్కం' సంక్షిప్త సంగ్రహ నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం ఉదయం 11 గంటలకు విజయనగరం గురజాడ స్మారక మందిరంలో కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయోత్సవాల గౌరవ రజత ఫలక ప్రతిష్టాపన, జాతీయ ఉత్సవాల సావనీర్ ఆవిష్కరణ, పత్రికా గోష్టి నిర్వహించనున్నట్టు చెప్పారు. పై కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డి.విజయభాస్కర్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సాహితీ, సాంస్కృతిక రంగాలలో లబ్ద ప్రతిష్టులు, సామాజిక రంగంలో ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. దేశమంటే మట్టి కాదోయ్..దేశమంటే మనుషులోయ్..ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్ పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు సాహితీవేత్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో మొజాయిక్ సాహిత్య సంస్థ ప్రతినిధి ఎల్.ఆర్.స్వామి పాల్గొన్నారు.

సంస్కరణలతోనే మార్పు సాధ్యం

రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి సంస్థ డీజీ చక్రవర్తి


సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రెవెన్యూ వ్యవస్థను, చట్టాలను నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవలసిన అవసరం ఉందని, ఈ మార్పు సంస్కరణల ద్వారా మాత్రమే సాధ్యమని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ చక్రవర్తి అన్నా రు. కలెక్టరేట్‌లో బుధవారం 'రెవె న్యూ వ్యవస్థ–సంస్కరణలు' అనే అం శంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణలు తేవాలంటే ఎంతో మేధోమధనం అవసరమన్నారు. సర్వే రికార్డులు ఎంత పక్కాగా ఉంటే రెవె న్యూ రికార్డులు అంత పక్కాగా ఉంటాయన్నారు. జేసీ సృజన మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణల ద్వారా తెచ్చే మార్పు ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడేదిగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రెవెన్యూ ఉద్యోగ సంఘాల ఉద్యోగ సంఘాల నుంచి అభిప్రాయాలను, సలహాలను డీజీ స్వీకరించారు. ఈ వర్క్ షాపులో జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

నేడు ఐటీ కంపెనీల ప్రారంభం

విశాఖ సిటీ:

రేసపువానిపాలెంలో ఏపీ సైబర్ టవర్స్‌లో టెక్ హబ్ పేరుతో ఏర్పాటు చేసిన 8 ఐటీ కంపెనీలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ప్రారంభించనున్నారు. ఉదయం నగరానికి చేరుకోనున్న మంత్రి తొలుత ఐటీ కంపెనీలను ప్రారంభించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఐటీ మౌలిక సదుపాయాలపై కలెక్టర్‌తో సమావేశమయ్యాక, రియల్‌ఎస్టేట్ డెవలపర్స్‌తోనూ, ఇండస్ట్రీస్ అసోసియేషన్స్‌తోనూ సమావేశం కానున్నారు.

భవిష్యం

మేషం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. సన్నిహితుల నుంచి సహాయం. వాహనయోగం. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.

వృషభం: రుణయత్నాలు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో స్వల్ప వివాదాలు. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు. ఆరోగ్యభంగం.



మిథునం: దూర ప్రయాణాలు. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగులకు గందరగోళం. దైవదర్శనాలు

కర్కాటకం: పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. ఆర్థిక ప్రగతి. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా పూర్తి. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు పదోన్నతులు.

సింహం: ప్రయాణాలు. రుణయత్నాలు. పనులలో జాప్యం. బంధువులు, మిత్రులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

కన్య: పనులు సకాలంలో పూర్తి. సంఘంలో గౌరవం. ఇంటర్వ్యూలు అందుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు. వ్యాపారాలు లాభిస్తాయి.

తుల: ప్రయాణాలు వాయిదా. శ్రమాధిక్యం. పనులు మందగిస్తాయి. బంధువుల నుంచి ఒత్తిడులు. వ్యాపారాలు సామాన్యమే. ఉద్యోగులకు ఆకస్మిక మార్పులు.

వృశ్చికం: ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు. వ్యాపారాలు పుంజుకుంటాయి. బంధువుల కలయిక. విందు వినోదాలు. ఆకస్మిక ధన, వస్తులాభాలు.

ధనుస్సు: పాతమిత్రుల కలయిక. ఇంటర్వ్యూలు అందుతాయి. ఆసక్తికరమైన సమాచారం. ఆలయ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

మకరం: కుటుంబంలో చికాకులు. బంధువుల నుంచి ఒత్తిడులు. అనుకోని ప్రయాణాలు. ఖర్చులు. ఉద్యోగ, వ్యాపారాలలో మార్పులు ఉండవచ్చు.

కుంభం: వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. దూరప్రయాణాలు. అనుకోని ధనవ్యయం. ఉద్యోగులకు పనిభారం. వ్యాపారాలు మందగిస్తాయి. సోదరుల కలయిక.

మీనం: పనులలో విజయం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

– సింహంభట్ల సుబ్బారావు

ప్రభుత్వ పాత ఐటీఐలో శిక్షణ

మర్రిపాలెం (విశాఖ ఉత్తరం): ప్రభుత్వ పాత ఐటీఐలో ఆడియో విజువల్, హోమ్ అప్లయెన్సెస్ ఇన్‌స్టలేషన్, డెమోలో శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ ఆర్.వి.రమణ తెలియజేశారు. శాంసంగ్ టెక్నికల్ స్కూల్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. ఐటీఐ లేదా ఇంటర్ విద్యార్హత గల అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 28 నుంచి 10 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విశాఖపట్నం పరిసర ప్రాంతాలలోని శాంసంగ్ కంపెనీ గుర్తింపు గల షోరూమ్‌లలో ఉద్యోగాలు ఉంటాయన్నారు. నెలకు రూ.7 వేల జీతం చెల్లిస్తారని వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25లోగా పాత ఐటీఐ జంక్షన్ ప్రాంతం ప్రభుత్వ పాత ఐటీఐ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఆధార్ తప్పనిసరి

అగనంపూడి(గాజువాక): ఓపెన్ స్కూల్ పరీక్షలకు వచ్చే ఏడాది నుంచి ఆధార్ కార్డు తప్పనిసరి చేయనున్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు జరుగకుండా చర్యలు చేపట్టారు. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించనున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజుకు ఈనెల 31వ తేదీ గడువు కావడంతో ఇంకా ఈ ఏడాదికి ఆధార్ కార్డు అవసరం లేనట్టే. ఇప్పటికే చాలామంది పరీక్షలకు ఫీజు చెల్లించిన నేపథ్యంలో ఈ ఏడాది ఫీజు చెల్లించేవారికి ఇది వర్తించదు. అయితే వచ్చే ఏడాది ఈ నిబంధనను పక్కాగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) మానవ వనరుల శాఖను అనుమతి కోరగా, దీనికి కేంద్ర మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. అలాగే పరీక్షలకు హాజ రయ్యే విద్యార్థి వేలిముద్రలను పరీక్షల కేంద్రం వద్ద స్కానింగ్ చేయనున్నారు.

26, 27 తేదీల్లో లివింగ్ స్పేస్-2017

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): శ్రీరామ్ ప్రాపర్టీస్, పేరం గ్రూప్, మైత్రి ఇన్‌ఫ్రా సహకరంతో ది హిందూ లివింగ్ స్పేస్-2017ను ఈ నెల 26, 27 తేదీల్లో బీచ్‌రోడ్డులోని హోటల్ గేట్ వేలో నిర్వహిస్తున్నట్లు ఏజీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో నగరంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

27న వంటల పోటీలు

ఈ నెల 27వ తేదీన బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో వంటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ది హిందు ఏజీఎం జి.శ్రీనివాస రావు పేర్కొన్నారు. పోటీదారులు తమ ఇంటి దగ్గరే వంటలు తయారీ చేసి ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంటలోపు పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. వంట రుచి, రంగు, ప్రెజెంటేషన్ ఆధారంగా విజేతలను ప్రకటిస్తామని, మూడు విలువైన బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు vantalapoti@gmail. com మెయిల్‌కు లేదా 0891-2536159/98494 98771 నంబర్లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

వెండితెర తెలుగు / హిందీ / ఇంగ్లీష్





వివేకం : కామేశ్వరి : మద్దిలపాలెం : ఫోన్: 6525600, 11.00, 2.30, 6.15, 9.45, లీలా మహల్, విశాఖపట్నం, ఫోన్: 2562480, 11.00, 2.30, 6.30, 9.15,సంగం : విశాఖపట్నం: ఫోన్: 2747150, 11.00, 2.30, 6.15, 9.15,
శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-2 : (104 ఏరియా) ఫోన్: 2558658, 6.00, 9.00, వీ మ్యాక్స్ స్క్రీన్-3, 11.30, 2.30, 6.30,10.00,

ఆనందో బ్రహ్మ : శారద : విశాఖపట్నం, ఫోన్: 2564796, 11.00, 2.30, 6.15 10.00, వీ మ్యాక్స్ స్క్రీన్-2, 11.15, 2.30, 6.15, 10.00, శ్రీకన్య విశాఖపట్నం : 11.00, 2.30, 6.30, 9.30,సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

నేనేరాజు నేనే మంత్రి : జ్యోతి : విశాఖ పట్నం. ఫోన్: 2788788, 11.00,2.30, 6.15,9.30, శ్రీరామా : విశాఖపట్నం ఫోన్: 2552445, 11.00, 2.45, 6.15, 9.45, ఊర్వశి : కంచరపాలెం, 10.45, 2.00, 5.35, 9.00 సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

జయ జానకి నాయక : శరత్ విశాఖ పట్నం: ఫోన్: 2747151,11.00, 2.30, 6.15, 9.45, శ్రీవెంకటేశ్వర : విశాఖ పట్నం, ఫోన్: 2565566, 11.00, 2.30, 6.30, 9.30, రమాదేవి : విశాఖపట్నం, ఫోన్: 2564796, 11.30,2.30, 6.30, 10.00, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-1(104 ఏరియా) ఫోన్: 2558658, 10.45 2.00, 5.35, 8.40. సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

లై : వెంకటేశ్వర : ఫోన్: 2565 566, 11.00, 2.30, 6.15, 9.30, మెలోడి: ఫోన్: 10.45, 2.30, 6.15, 10.00,కిన్నెర : మద్దిలపాలెం: 6525600, 11.00, 2.30,6.15, 9.45, గోకుల్, విశాఖపట్నం: 11.00, 2.30, 6.15, 9.30, సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ

నక్షత్రం : వీ మ్యాక్స్ స్క్రీన్-1 ఫోన్: 6060999, 10.30, 1.45, 5.40, 8.45,

ఫిదా : జగదాంబ : ఫోన్: 2564796, 11.00, 2.30, 6.15, 10.00, సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్,

గౌతమ్‌నంద : పరమేశ్వరి : కంచర పాలెం 10.30, 1.45, 5.40, 8.45,

నగరంలో నేడు

- ఉదయం 8.30 గంటలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంపత్ వినాయక్ టెంపుల్ వద్ద ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ
- 10 గంటలకు సీతమ్మధారలోని నార్ల వెంకటేశ్వరరావు భవనంలో వీజెఎఫ్ కుటుంబ వినోద వేదిక కార్యక్రమం
- 10.30 గంటలకు హైదరాబాద్‌లో నిర్వహించే అఖిల భారత సదస్సు కరపత్రాల్ని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించనున్న పౌర హక్కుల సంఘం
- సాయంత్రం 6 గంటలకు విశాఖ సాహితీ ఆధ్వర్యంలో శ్రీ లలితాపీఠం దర్బార్ హాల్‌లో విశాఖ జిల్లా కథలు-మాండలిక భాషలు అంశంపై సదస్సు.

తిరుమల సమాచారం

- తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు

- ఉచిత గదులు – 3 ఖాళీ ఉన్నాయి
- రూ.50 గదులు – 7 ఖాళీ ఉన్నాయి
- రూ.100 గదులు–15 ఖాళీ ఉన్నాయి
- రూ.500 గదులు –5 ఖాళీ ఉన్నాయి

సేవలు

- సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి



- వసంతోత్సవం–150 ఖాళీ ఉన్నాయి
- ఆర్జిత బ్రహ్మోత్సవం –200ఖాళీ ఉన్నాయి
- గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ

విశాఖ బులియన్

గోల్డ్ 24 క్యారట్స్ 10గ్రా.	29,920
గోల్డ్ 22 క్యారట్స్ 10గ్రా.	27,530
వెండి కిలో ధర	39,500

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	362.00
విజయనగరం	366.00
శ్రీకాకుళం	366.00

వాతావరణం

రానున్న 24 గంటల్లో ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, దేశ పశ్చిమ తీరం వెంబడి చెదురుమదురుగా ఓ మోస్తరు వర్షపాతం నమోదవుతుంది. ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

విశాఖపట్నం వాతావరణం

గరిష్టం కనిష్టం

[illegible]

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	34.7	28.5
కోల్‌కతా	31.8	26.8
బెంగళూరు	28.6	20.6
ముంబై	31.6	26.4
చెన్నై	35.9	25.7

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	36.9/28.4	శ్రీకాకుళం	34.4/25.5
అనంతపురం	35.4/24.2	విజయనగరం	34.4/25.5
చిత్తూరు	35.3/26.0	విజయవాడ	34.3/25.2
తిరుపతి	35.3/26.0	ఖమ్మం	34.2/21.6
కడప	35.2/27.5	వరంగల్	32.9/25.0
గుంటూరు	35.2/23.8	విశాఖపట్నం	32.7/26.5
కర్నూలు	35.1/25.0	హైదరాబాద్	32.7/23.8
ఏలూరు	34.8/26.3	రంగారెడ్డి	32.7/23.8
రాజమండ్రి	34.8/26.3	మహబూబ్‌నగర్	32.7/23.0
తాడేపల్లిగూడెం	34.8/26.3	కరీంనగర్	31.8/25.6
ఒంగోలు	34.7/26.1	మెదక్	31.4/21.2
కాకినాడ	34.6/26.0	నిజామాబాద్	30.5/23.8
నల్లగొండ	34.5/24.0	ఆదిలాబాద్	29.8/22.1

బుల్లితెర

W

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

- ఉ.06.30 నిరీక్షణ
- ఉ.07.00 న్యూస్ 360
- ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
- ఉ.09.00 రీజనల్ న్యూస్
- ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
- ఉ.10.00 మనసులో మాట
- ఉ.11.30 పొలిటికల్ కారిడార్
- మ.02.30 డాక్టర్స్ టైమ్
- సా.04.30 మార్గం
- సా.05.00 స్పీడ్ న్యూస్
- సా.05.30 ఉర్దూ న్యూస్
- రా.07.30 పొలిటికల్ కారిడార్
- రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
- రా.09.00 న్యూస్ 360
- రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
- రా.10.30 స్క్రీన్‌ప్లే
- రా.11.30 న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 బొమ్మ బొరుసు బంగారు బాట
ఉ.09.30 మౌనరాగం
మ.12.00 పెళ్ళాంతో పనేంటి
మ.03.00 మా అన్నయ్య బంగారం
రా.09.00 నిన్నే ప్రేమిస్తా




మూవీస్ నౌ
ఉ.07.15 ఇమ్మోర్టల్స్
ఉ.08.55 స్పిసిస్
ఉ.10.45 చైల్డ్స్ ప్లే 2
మ.02.30 టుమారో నెవర్ డైస్
రా.10.50 సూపర్‌మ్యాన్ 3




హెచ్‌బీవో
ఉ.10.49 ఎక్స్‌ఎక్స్‌ఎక్స్
మ.12.55 ద డార్క్ నైట్
మ.03.26 ఘోస్ట్ షిప్
సా.04.56 ద హ్యాంగోవర్-2
రా.11.26 ద రింగ్



స్టార్ గోల్డ్
ఉ.07.05 ఇన్‌సైడియస్
మ.12.45 గోల్‌మాల్ 3
మ.03.50 తక్దీర్‌వాలా
సా.06.55 జాలీ ఎల్.ఎల్.బి.2
రా.10.00 దబాంగ్ 2



మా మూవీస్
ఉ.07.00 హ్యాపీ హ్యాపీగా
ఉ.09.00 రామదండు
మ.12.00 కరెంట్
మ.03.00 చారులత
సా.05.00 దేశముదురు



జీ సినిమా
ఉ.08.24 మాణిక్య
ఉ.11.27 మర్ద్
మ.02.57 అపరిచిత్: ద స్ట్రేంజర్
రా.09.00 రివాల్వర్ రాజా
రా.11.55 క్షత్రియ ద ఫైటర్

పైసలిస్తే ఎన్ని ఫ్లోర్లయినా ఓకే

- అవినీతి కేంద్రంగా టౌన్‌ప్లానింగ్ విభాగం
- చర్యలు తీసుకున్నా మార్పు శూన్యం
- అక్రమార్కులకు ప్రజాప్రతినిధుల అండ

విశాఖ సిటీ : జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి అంతస్తులుగా ఎదుగుతోంది. ప్లాన్ అనుమతులు మంజూరు చేసే విషయంలో చైన్‌మేన్ నుంచి పై అధికారి వరకూ దోచుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. అమ్యామ్యాలతో చేయి తడిపితే... ప్లాన్‌ను ఏమార్చి ఎన్ని అంతస్థులైనా పెంచుకోవచ్చు. ఉన్నతాధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా... టౌన్ ప్లానింగ్ విభాగంలో మాత్రం మార్పు కనిపించడం లేదు. తాజాగా జోన్ – 5లో జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడంతో మరోసారి టౌన్‌ప్లానింగ్ అవినీతి వ్యవహారం చర్చనీయాంశమైంది.

టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి కంపు

మహా విశాఖ నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి కంపు కొడుతోంది. అనుమతుల మంజూరు విషయంలో దోచుకోవడమే తమ ప్రథమ ఉద్యోగంగా భావిస్తూ... పనులు చక్కబెట్టుకుంటున్న ఘనులు పెరిగిపోతున్నారు. అక్రమంగా అదనపు అంతస్థుల నిర్మాణం కోసం బాహాటంగానే బేరసారాలు సాగించేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులను ఏపీ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ పర్మిషన్ సిస్టమ్ ద్వారా తీసుకోవచ్చు. ఒక్కసారి ఎన్ని అంతస్తులకు అనుమతి పొందారో అంత వరకు మాత్రమే భవనం నిర్మించుకోవాలి. కానీ ఇక్కడే టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసుల వర్షం కురుస్తోంది. జీ ప్లస్ 2 వరకూ అనుమతి



అక్కయ్యపాలెంలో అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న అదనపు అంతస్థు

పొందిన యజమాని ఆ పై మరో ఫ్లోర్... ఆనక ఇంకో ఫ్లోర్.. ఇలా అంతస్థు మీద అంతస్థు అక్రమంగా నిర్మించేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న 8 జోన్లలోనూ ఈ తరహా నిర్మాణాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇవన్నీ ఎక్కడ.. ఎలా.. ఎప్పటి నుంచి జరుగుతున్నాయో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న కింది స్థాయి నుంచి పై స్థాయి ఉద్యోగి వరకూ అందరికీ తెలుసు. అయినా పడగొట్టే పని మాత్రం చెయ్యరు. ఆ అక్రమాల అంతస్థుల నుంచి ఎంత మేర వసూలు చెయ్యాలనుకుంటున్నారో అంత వరకూ దోచుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా నగర వ్యాప్తంగా ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలు 1200 వరకు ఉన్నాయి.

అప్‌లోడ్ నుంచే అవినీతికి బీజం

జీవీఎంసీ పరిధిలో 100 చదరపు గజాలు దాటి ఇల్లు నిర్మించుకోవాలంటే తప్పనిసరిగా ప్లాన్ తీసుకోవాలి. ఈ ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడి



అక్రమ నిర్మాణాలపై గాజువాకలో జెడ్సీతో మంగళవారం మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రామకృష్ణప్రసాద్

నుంచి టౌన్ ప్లానింగ్ అవినీతి పర్వం ప్రారంభమవుతుంది. స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చెయ్యాలి. ఈ స్థాయిలోనే 5 నుంచి 15 వేల రూపాయల వరకూ చేతులు మారుతుందనే ఆరోపణలున్నాయి. ఆపై ఆన్‌లైన్‌లో అనుమతులు ఇస్తున్నా భవన నిర్మాణ సమయంలో మాత్రం టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తారు. ఈ పరిశీలన సమయంలో ఖర్చుల పేరుతో కొంత చెల్లించాల్సిందే. ఆ తర్వాత భవన నిర్మాణం పూర్తయ్యాక ఆక్యుపెన్సీ సర్టిఫికేట్(ఓసీ) టౌన్ ప్లానింగ్ అధికారులు జారీ చేయాలి. ఇక్కడ కూడా చేతిలో భారీ బరువు తూగాల్సిందే. ప్లానింగ్ బట్టి ఇక్కడ రేటు మారుతుంటుంది. జీ ప్లస్ 2 కి ఒక రేటు, ప్లస్ 3 కి ఒక రేటు.. ఇలా దాదాపు అన్ని జోన్లలోనూ ధరలు అధికారికంగా ఫిక్స్ చేసి ఉంచారు. ఎందుకంటే ఓసీ లేకపోతే రెట్టింపు పన్ను జరిమానాగా కట్టాల్సి ఉంటుంది. ఈ కారణంగానే ఈ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం అధికారులు ఎంత డిమాండ్ చేసినా ఇచ్చేందుకు నిర్మాణదారులు సిద్ధంగా ఉంటారు. ఎవరికి రావాల్సిన వాటా వారికి సరిగా అందేలా చేతిలో నోట్ల కట్ట పెట్టకపోతే ఆ భవనానికి మూడినట్లే. అప్పుడు మాత్రం నిర్మాణంలోని అన్ని లోపాలు బయటకు వస్తాయి.

ప్రజాప్రతినిధుల చలవతోనే...

'ఫలానా ప్రాంతంలో బిల్డింగ్ కడుతోంది మావాడే.. ఎంతో కొంత ఇస్తాడు. ఆ బిల్డింగ్ జోలికి వెళ్లొద్దు..' ఇటీవల ఓ జోన్‌లోని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ప్రజాప్రతినిధి వేసిన ఆర్డర్. ఇలాంటి ప్రత్యేక ప్యాకేజీలు సదరు ప్రజాప్రతినిధుల నుంచి వస్తుండటంతో.. వారి అండతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వసూళ్ల పర్వంలో అందరినీ మించిపోతున్నారు. వారి అనుయాయుల అవినీతి అంతస్థులపై చర్యల బీటలు పడకుండా వీరు కాపాడుతుంటే.. వీరి ఉద్యోగంపై బదిలీ వేటు పడకుండా రాజకీయ నేతలు కొమ్ముకాస్తున్నారు. ఇలా టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని చాలా వరకూ అక్రమాల బాట పట్టిస్తున్న వారిలో రాజకీయ నేతలే కీలక పాత్ర పోషిస్తున్నారని ఓ జీవీఎంసీ ఉన్నతాధికారి మాట్లాడటం గమనార్హం. మరోవైపు సిబ్బంది కొరతతో మొత్తం విభాగం కొంతమంది చేతుల్లోనే ఉంది. దీంతో వారే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. వీరి అక్రమాలపై పలుమార్లు ఫిర్యాదులు వస్తుండగా ఇటీవలే నగరంలోని చైన్‌మెన్లను జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ వివిధ జోన్లకు బదిలీ చేసినా టౌన్‌ప్లానింగ్‌లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు.

ఇవీ అవినీతి భాగోతాలు

- జూలై 10న జోన్ – 4లో చైన్‌మాన్ ఎన్‌వీ తులసీకుమార్ 25 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- అక్రమంగా అంతస్థులు నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు జోన్ – 5లో నిర్మాణాల్లో ఉన్న భవనాల్లో ఏసీబీ అధికారులు ఆగస్టు 23న తనిఖీలు నిర్వహించారు. ఇందులో పెద్ద మొత్తంలో అనుమతులు లేకుండానే అంతస్థులు నిర్మిస్తున్నారని ఏసీబీ బృందం గుర్తించింది.
- జోన్ – 4 పరిధిలో అక్కయ్యపాలెంలోని రామాలయం వీధిలో 45–10–18/2లో 101 చదరపు గజాల స్థలంలో జీ ప్లస్ 2కు ప్లాన్ తీసుకుని మూడో అంతస్థు అక్రమంగా నిర్మిస్తున్నారు. గతంలో మూడుసార్లు అక్రమ అంతస్థుని పడగొట్టినా నిర్మాణం సాగుతోంది. ఈయనకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది అండదండలున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఆయా జోన్లలో ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ అంతస్థులు నిర్మిస్తున్నారంటూ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకుని చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

అనధికార నిర్మాణాలపై ఏసీబీ కన్ను

గాజువాక : గాజువాకలో చేపట్టిన అనధికార నిర్మాణాలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహకారంతో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం సాగుతోందన్న ఫిర్యాదులపై వారు బుధవారం



ఏసీబీ అధికారులు పరిశీలించిన భవనం

పలు నిర్మాణాలను పరిశీలించారు. ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ సారథ్యంలో సీఐలు గణేష్, రమణమూర్తి, తదితరులు గృహ యజమానులను ప్రశ్నించా రు. పాత గాజువాక ప్రాంతంలో మూడు నిర్మాణాలను పరిశీలించిన అధికారులు వాటికి పొందిన అనుమతులపై అడిగి తెలుసుకున్నారు. అనుమతుల కోసం ఒక్కో భవనానికి ఎంత ఫీజు చెల్లించారు వంటి వివరాలు నమోదు చేశారు. పాతగాజువాకలో ఒక భవనానికి రుసుం చెల్లించలేదని ఏసీబీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. కాగా గత ఏడాది జనవరి 1నుంచి జీవీఎంసీ గాజువాక జోన్ టౌన్ ప్లానింగ్‌లో పని చేస్తున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల వివరాలను కూడా వారు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గాజువాక జోనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాజువాక ప్రాంతంలోని వార్డుల్లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పని చేసిన వెంకటేశ్వరరావు, వరప్రసాద్‌ల వివరాలపై పూర్తి సమాచారం కోరినట్టు జీవీఎంసీ వర్గాలు తెలిపాయి.

82 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార (విశాఖ ఉత్తరం) : గంజాయి తరలిస్తున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ జిల్లాలోని జి.మాడుగుల మండలం గంజా గ్రామం నుంచి గుట్టుగా గంజాయి తీసుకొచ్చి నగర శివారు కొమ్మాదిలోని డీటీఆర్ విల్లా అపార్టుమెంట్‌లోని ప్లాట్ నెంబర్ 101లో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జి.మాడుగుల మండలం గంజా గ్రామానికి చెందిన డి.రమణమూర్తితో పాటు బీహార్‌కు చెందిన బిశ్వజిత్ సింగ్, సూజిత్ కుమార్ సింగ్, సంతోష్‌కుమార్ పాశ్వన్, ప్రిన్సి కుమార్ సింగ్‌లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 82 కిలోల గంజాయి, ఐదుసెల్ ఫోన్‌లు, రూ.8 వేల 380లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురుని పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ చిట్టిబాబు ఆదేశాల మేరకు ఎస్‌ఐలు సతీష్, మూర్తి, సిబ్బంది దాడి చేశారు.



గంజాయి నిందితులతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలు

అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : జీవీఎంసీ 59వ వార్డు తుంగ్లాంలో నివాసముంటున్న జీవీఎంసీ వాటర్ విభాగం పంప్ ఆపరేటర్ వనవాడ నర్సింగరావును గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి సమయంలో విధుల్లో భాగంగా ఆటోనగర్, తోకాడ ఏరియాలకు మంచినీటి సరఫరా కోసం వాటర్ వాల్స్ విప్పుతున్నాడు. ఆ సమయంలో ఆటోనగర్ ఎస్‌ఆర్‌ఎంటీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. నర్సింగరావును గుర్తించిన కొందరు 108 వాహనంలో నగరంలోని ఆస్పత్రికి తరలించారు.

ఇళ్ల కుంభకోణంలో 13 మందికి రిమాండ్

- 36 మంది దళారుల ద్వారా రూ.2.91 కోట్లు వసూలు చేసిన మాజీ ఏపీడీ
- నకిలీ డాక్యుమెంట్లతో ఇళ్ల కేటాయింపు
- మిగిలిన నిందితుల కోసం దర్యాప్తు
- సౌత్ ఏసీపీ రామ్మోహన్‌రావు వెల్లడి
- 'అక్రమార్కుల ఆవాసాలు' శీర్షికతో ముందే వెలుగులోకి తెచ్చిన సాక్షి

గాజువాక : జీవీఎంసీ 55వ వార్డులోని మదీనాబాగ్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల అక్రమ కేటాయింపుల్లో దువ్వాడ పోలీసులు 13 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న మాజీ సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.కాంతి మోహన్‌రావు సహా అరెస్టు చేసిన వారందరినీ రిమాండ్‌కు తరలించారు. కుంభకోణంలో మొత్తం 37 మంది నిందితులు కాగా, మిగిలిన వారి కోసం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సౌత్ ఏసీపీ జె.రామ్మోహన్‌రావు తెలిపారు. అయితే 'అక్రమార్కుల ఆవాసాలు' శీర్షికతో ఈ అవినీతి భాగోతాన్ని సాక్షి పత్రిక మంగళవారమే వెలుగులోకి తీసుకొచ్చింది. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుంభకోణానికి సంబంధించిన వివరాలు ఏసీపీ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... నగరంలో 26 పట్టణ మురికివాడల్లో నివసిస్తున్న పేదల కోసం ప్రభుత్వం 15,320 ఇళ్లు నిర్మించింది. అందులో భాగంగా మదీనాబాగ్‌లో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద 2,048 ఇళ్లు నిర్మించి 1248 మందికి గృహాలు కేటాయించింది. వారికి సబ్సిడీ రుణాలు కూడా మంజూరు చేశారు. చాలామంది లబ్ధిదారులు ఆ ఇళ్లల్లోకి వెళ్లలేదు. అవిగాక మరో 780 ఇళ్లు ఖాళీగా మిగిలిపోయాయి. 2014 అక్టోబర్‌లో చోటుచేసుకున్న హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ఇళ్లు కూలిపోయిన పలువురు బాధితులు షెల్టర్ కోసం ఖాళీగా ఉన్న ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. అప్పటికి జీవీఎంసీ గాజువాక జోన్ సహాయ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావు ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. స్థానిక నాయకురాలు సుహాసినితో కుమ్మక్కై బి.సూర్యప్రకాష్‌ను, ఆ తరువాత మరో 34 మంది దళారులను ఏర్పాటు చేసుకున్నాడు. వారి ద్వారా జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల అక్రమ కేటాయింపులకు పూనుకున్నాడు. రూ.50 వేల నుంచి రూ.1.50లక్షల వరకు ఒక్కొక్కరి నుంచి వసూలు చేసి ఇళ్లు కేటాయిస్తున్నట్టు నకిలీ డాక్యుమెంట్లు అందజేశాడు. సూర్యప్రకాష్, సుహాసిని సహాయంతో దరఖాస్తుదారుల నుంచి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు తీసుకుని నకిలీ పట్టాలు, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం స్లిప్పులను తయారు చేసి దరఖాస్తుదారులకు అందజేశాడు. అందుకుగాను సూర్యప్రకాష్‌కు 39 ఇళ్లు, సుహాసినికి ఏడు ఇళ్లు ఇచ్చాడు. మిగిలిన దళారులకు ఒకటి నుంచి 40 ఇళ్ల వరకు నకిలీ డాక్యుమెంట్లతో మంజూరు చేశాడు. ఈ వ్యవహారంలో రూ.2కోట్ల 91లక్షల 56వేలు వసూలు చేసిన నిందితులు మొత్తం 363 ఇళ్లను నకిలీ డాక్యుమెంట్లతో కేటాయించినట్టు ఏసీపీ తెలిపారు. ఇప్పటి వరకు 41 మంది సాక్షులను విచారించామని, మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. సమావేశంలో దువ్వాడ సీఐ ఎన్.సాయి, ఎస్‌ఐ జోగారావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రామ్మోహన్‌రావు (వెనుక సాధారణ దుస్తుల్లో నిందితులు)

ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేలా..

- నగర నిర్మాణానికి 'స్మార్ట్' ప్రణాళికలు
- రూ.1887 కోట్లతో 42 ప్రాజెక్టులు
- అమలు దశలో రూ.180 కోట్ల పనులు
- మీడియాతో జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్



విశాఖసిటీ: ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేలా అత్యాధునిక సాంకేతికతతో విశాఖ స్మార్ట్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని జీవీ ఎంసీ కమిషనర్ హరినారాయణన్ స్పష్టం చేశారు. రూ. 1,887 కోట్లతో 42 ప్రాజెక్టులు చేపట్టగా.. ఇప్పటికే రూ.180 కోట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్లో మీడియాతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా మాట్లాడారు. 10 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ వ్యవస్థకు జీవీఎంసీ అడుగులు వేస్తోందని వివరించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు రూపకల్పన, చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు, ప్రస్తుత ప్రాజెక్టుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామన్నారు. రూ.1887.91 కోట్లతో 42 ప్రాజెక్టులు చేపట్టామన్నారు. ఇందులో వివిధ ప్రభుత్వ సంస్థలతో కలిసి రూ.700.50 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. అమలు దశలో రూ.196.35 కోట్లతో 12 ప్రాజెక్టులుండగా రూ.502.06 కోట్లతో ఆర్ఎఫ్‌పీ దశలోనూ, రూ.489 కోట్లతో 8 డిజైన్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు.

డిసెంబర్ నాటికి కమాండ్ కంట్రోల్

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు చురుగ్గా సాగుతున్నాయని కమిషనర్ తెలిపారు. ఈ–గవర్నెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సేవలతో మిళితమైన ఈ విభాగం డిసెంబర్ నెలాఖరుకి సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అంతా 'స్మార్ట్'గానే

స్మార్ట్‌పోల్స్, స్మార్ట్ బిన్లు, స్మార్ట్ జీపీఎస్ అనుసంధానిత బస్సులు, బస్టాప్‌లు, ట్రాఫిక్, సీసీ టీవీ వ్యవస్థ ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యే దశలో ఉన్నాయని వివరించారు. ఇప్పటికే రూ.1.10 కోట్లతో 6 జీవీఎంసీ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేశామనీ, త్వరలో రూ.5.9 కోట్లతో అదనంగా 25 పాఠశాలల్లో అమలు చేస్తామని తెలిపారు. వీటితో పాటు 27 జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో రూ.3.3 కోట్లతో 150 డిజిటల్ ప్రొజెక్టర్ తరగతి గదుల్ని 3 నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

జగదాంబ జంక్షన్‌లో మల్టీలెవల్ పార్కింగ్

స్మార్ట్ సిటీలో భాగంగా రూ. 507.30 కోట్లతో చేపట్టబోయే 9 పనులు డీపీఆర్ దశలో ఉన్నాయని కమిషనర్ తెలిపారు. జగదాంబలో రద్దీ పెరుగుతుండటంతో ఈ ప్రాంతంలో పార్కింగ్ కష్టాలు దూరం చేసేందుకు మల్టీలెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. 130 చదరపు మీటర్ల స్థలంలో ఈ మెకనైజ్డ్ పార్కింగ్ వ్యవస్థ నిర్మించేందుకు గతంలో ఆసక్తి వ్యక్తీకరణకు సంస్థల్ని ఆహ్వానించినా ఎవ్వరూ ముందుకు రాలేదనీ మరోమారు ఈవోఐకి పిలిచేందుకు సిద్ధమవుతున్నామన్నారు. రూ.12 కోట్లతో పబ్లిక్ బైక్ షేరింగ్, రూ. 5 కోట్లతో వెండింగ్ జోన్లు, రూ. 2.30 కోట్లతో ఈ–రిక్షాలు అందుబాటులోకి తీసుకురానున్నామని కమిషనర్ హరినారాయణన్ వివరించారు.

ఏయూలో పీఆర్‌సీ కమిటీ సభ్యులు



సభ్యులను సత్కరిస్తున్న వీసీ నాగేశ్వరరావు

ఏయూక్యాంపస్(విశాఖతూర్పు): కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, జనాభా అధ్యయన కేంద్రానికి చెందిన ఇద్దరు సభ్యులు ఆచార్య పి.ఎం కులకర్ణి, డా. సయీద్ ఉనీసా బుధవారం ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులతో కలసి ఏయూలోని జనాభా అధ్యయన కేంద్రం పనితీరును పరిశీలించారు. వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావుతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఏయూ అధ్యయన కేంద్రం సంచాలకులు బి.మునిస్వామి స్వయంగా కేంద్రం పనితీరును వివరించారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున కమిటీ సభ్యులను వీసీ నాగేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డి.ఈ బాబు, డీన్ కె.వెంకట సుబ్బయ్య, కె.నిరంజన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి



ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్, అధికారులు

ద్వారకానగర్(విశాఖ దక్షిణ): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని కమిషనర్ హరినారాయణన్ అన్నారు. జీవీఎంసీ ఎదురుగా గల ఆంధ్రకేసరి విగ్రహం వద్ద ప్రకాశం 146వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరంలో సైమన్ కమిషన్‌ను ఎదిరించి చురుకుగా వ్యవహరించడమే కాక, ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు జీవీవీఎస్ మూర్తి, వర్మ, చీఫ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, జోన్–2 కమిషనర్ నల్లనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలాల వేలానికి విశేష స్పందన

12 స్థలాలకు వేలం



వేలం పాటను నిర్వహిస్తున్న అధికారులు

పెదవాల్తేరు(విశాఖ తూర్పు): హౌసింగ్ బోర్డు నిర్వహిస్తున్న స్థలాల వేలం పాటకు విశేష స్పం దన లభించింది. హెచ్‌బీకాలనీ లోగల హౌసిం గ్ బోర్డు కార్యాలయంలో బుధవారం పెందుర్తి కృష్ణరాయపురం, మధురవాడ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 12 స్థలాలకు వేలం పాట నిర్వహించగా 11 స్థలాలు అధిక ధరలకు అమ్ముడయ్యాయని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహమూర్తి తెలిపారు. కృష్ణరాయపురం 8 స్థలాలకు చదరపు గజానికి రూ.15వేలు ధరతో వేలం ప్రారంభించగా, రూ.23 వేల వరకు పలికిందన్నారు. మధురవాడ రెండు స్థలాలకు వేలం పాట నిర్వహించగా కనీస ధర రూ.20 వేలుకాగా రూ.23వేలు పలికిందన్నారు. పోతినమల్లయ్యపాలెం రెండు స్థలాలకు కనీస ధర రూ.25వేలు కాగా, వీటికి రూ.26వేల నుంచి రూ.50వేల వరకు ధర పలికిందని తెలిపారు. దీంతో సంస్థకు భారీ లాభాలు వచ్చాయన్నారు. వేలంపాటకు పర్యవేక్షకులుగా ప్రధాన కార్యాలయం నుంచి హనుమంతరావు హాజరయ్యారన్నారు. డీఈఈలు సుధాకర్, జయకుమార్, బాలకృష్ణ, ఏఈ డి.ఎస్.ప్రకాశరావు, సౌభాగ్యరావు పాల్గొన్నారు.

26న కాకినాడలో న్యాయవాదుల సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బైపా అరుణ్‌కుమార్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఈ నెల 26న తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో 4వ రాష్ట్ర స్థాయి న్యాయవాదులు, మేధావుల సదస్సు నిర్వహించనున్నట్టు అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జడ్జి కోర్టు సమీపాన ఫౌండేషన్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైపా మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ కులాలు, తెగల న్యాయవాదుల సమస్యలు చర్చించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తీర్మానాల రూపంలో నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. 13 జిల్లాల్లో ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకొని, ప్రోత్సాహం అందివ్వాలని కోరారు. దేశంలో షెడ్యూల్డు కులాల తెగలపై అనునిత్యం జరుగుతున్న దాడులు నిరోధించి దోషులను శిక్షించడంలో ప్రభుత్వ, పోలీస్ వైఫల్యాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. న్యాయమూర్తులు, స్టాండింగ్ కౌన్సిల్స్ తదితర పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల నిష్పత్తిని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రధానంగా చర్చించనున్నట్టు చెప్పారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నేత బరితెగింపు

- 400 గజాల స్థలం ఆక్రమణకు ప్రణాళిక
- తహసీల్దార్‌కు సీపీఎం నేత ఫిర్యాదు



ఆక్రమణకు గురవుతున్న భూమి ఇదే

మధురవాడ (భీమిలి): ఓ పక్క జిల్లాలోని భూ ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ముమ్మరంగా విచారణ చేస్తున్నా.. అధికార పార్టీ నేతలు వెనక్కు తగ్గడం లేదు. జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఆంజనేయస్వామి గుడి పక్కన పరదేశిపాలెం రెవెన్యూ పరిధిలోని సుమారు రూ. కోటి విలువచేసే 400 గజాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఆక్రమించేందుకు స్థానిక టీడీపీ నాయకుడు ప్రయత్నిస్తున్నట్లు సీపీఎం నేత, న్యాయవాది బోర అప్పలరెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ టీడీపీ నాయకులు ఇక్కడ గతంలో కొనుగోలు చేసి అమ్మేసిన భూమిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ, గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమిం చేస్తున్నాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక్కడ షెడ్లు వేసి వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాడని ఆయన వివరించారు. అంతేకాక గ్రామంలో పంచాయతీలు నిర్వహించి ఈ అక్రమాన్ని సక్రమం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాడని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని విన్నవించారు. అయితే సదరు టీడీపీ నాయకుడు మాత్రం తమకు చట్టబద్ధంగా సంక్రమించిన భూమి అని చెబుతుండటం గమనార్హం.

ఓబీసీ ఉద్యోగుల సభ్యత్వ నమోదుకు గ్రీన్‌సిగ్నల్

- స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సానుకూలత

VIZAG STEEL స్టీల్ సిటీ సమాచారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంఘం కార్యక్రమాల్లో మరో ముందడుగు పడింది. ఓబీసీ ఉద్యోగుల సభ్యత్వం నమోదుకు యాజమాన్యం సానుకూలత వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్టీల్‌ప్లాంట్ అధికారిక రికార్డుల ప్రకారం ఈ ఏడాది జూలై 24 నాటికి 2,483 మంది ఓబీసీ సభ్యులు ఉన్నారు. 1998 ముందు చేరిన వందలాది ఉద్యోగుల కేటగిరీ అధికారికంగా నమోదు కాకపోవడంతో వారు ఇప్పటికీ ఓసీ కేటగిరీలో కొనసాగుతున్నారు. దీంతో స్టీల్ ఓబీసీ సంఘం ఏర్పాటు నుంచి సంఘం నాయకులు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ అంశంపై ప్రయత్నాలు మొదలు పెట్టగా.. ఇప్పుడు యాజమాన్యం దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫైనాన్స్ సెక్షన్ అధికారులు కూడా ఓబీసీ సభ్యత్వ రుసుంను పే స్లిప్ నుంచి మినహాయించడానికి అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘం నాయకులు తాత్కాలికంగా 120 మంది సభ్యులకు దరఖాస్తు ఫారాలను అందజేసి సభ్యత్వ నమోదుకు సన్నాహాలు చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఫారాలను అందుబాటులోకి తెచ్చి సభ్యత్వ ప్రక్రియ వేగవంతం చేస్తామని ఓబీసీ సంఘం నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న బావులు!

పాడుపడిన బావులు ప్రాణాలు తీస్తున్నాయి. జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిల్లో పడి ఇప్పటికే ఎనిమిది మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరి కొంత మందిని స్థానికులు చూసి రక్షించారు. ఈ చర్యలు సమీప నివాసాల్లో ఉండే వారిలో ఆందోళన కలిగిస్తున్నాయి.



నర్సింహస్వామి ఆలయ గోపురం సమీపంలోని ప్రమాదకరంగా బావి



నెహ్రూ ఉన్నతపాఠశాల సమీపంలో ప్రమాకరంగా ఉన్న బావి

- భీమిలి పట్టణంలో ప్రమాదకరంగా 15 బావులు
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు

భీమునిపట్నం: భీమిలిలోని పలు ప్రాంతాల్లో పాడుపడ్డ పురాతన బావులు 15 వరకు ఉన్నాయి. ఇక్కడ నర్సింహస్వామి ఆలయ గోపురానికి ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన సుమారు వందేళ్లకు పై బడ్డ పెద్ద బావి ఉంది. సుమారు వంద అడుగుల లోతులో ఉన్న ఈ బావి నీటిని తాగడానికి, ఇతర అవసరరాలకు ప్రజలు ఎక్కువగా వినియోగించేవారు. ఇందులో దూకి కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డంతో పదిహేను సవత్సరాలుగా దీన్ని వాడడం లేదు. దీంతో ఇందులో చెత్తచెదారం చేరి నిరుపయోగంగా మారింది. ఇందులో ఇప్పటికి ఎనిమిది మంది వరకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇటీవల పది రోజుల కిందట ఒక వ్యక్తి ఇందులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ బావి చుట్టూ ఇళ్లు ఉండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీని గురించి ఇక్కడ ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

మరిన్ని ప్రాంతాల్లో నూ అదే పరిస్థితి

దీంతో పాటు పెద్దబజారు, చిన్న బాజారు, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో కూడా పలు బావులు ఇదే పరిస్థితుల్లో ఉన్నాయి. వీటిల్లో కూడా తరచూ అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చాలా చోట్ల పిల్లలు వీటి సమీపంలో ఆడుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని సందర్భాల్లో ఒకరిద్దరు పిల్లలు బావుల్లో పడ్డా అదృష్ణవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు.

తీర్మానాన్ని పట్టించుకోని అధికారులు

ప్రాణాంతకంగా ఉన్న బావులను మూసి వేయాలని అప్పట్లో మున్సిపాలిటీ పాలక వర్గం కూడా తీర్మానం చేసింది. అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు వీటిని పూడ్చాలంటే లక్షలాది రూపాయిలు వెచ్చించాల్సి వస్తుంది. కనీసం అధికారులు స్పందించి వీటిపై ఇసుప చట్రాలు(గ్రిల్స్)ను ఏర్పాటు చేస్తే సదుపాయంగా ఉంటుంది.

ఆందోళనగా ఉంది



మా ఇంటి ఎదురుగా పాడుపడిన బావిలో ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఎవరు ఇందులో దూకి ఆత్మహత్యకు పాల్పడుతారో అని భయంగా ఉంటోంది. అలా జరిగినప్పుడల్లా ఇళ్లల్లో ఉండడానికి భయమే.

– పి. ఉమామహేశ్వరి, స్థానికురాలు

ఏళ్లతరబడి ఇదే పరిస్థితి



ఇక్కడ పాడుబడ్డ బావులు ఉన్నా వీటిని మూయించడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. బావుల నీరు ఉపయోగించడం మానేయడంతో ఇవి ప్రమాదకరంగా ఉన్నాయి. వాటికి సమీపంలో పిల్లలు ఆడుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది.

– పి. శ్రీనివాస్, స్థానికుడు

చర్యలు తీసుకోవాలి



ప్రాణాంతకంగా మారిన బావుల విషయంలో అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి. ఇవి ఉండడం వల్ల చాలామంది ఆత్మహత్యలు చేసుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు.

– ఆర్. కృష్ణమాచార్యులు, స్థానికుడు

అన్ని బావులకు త్వరలో రక్షణ



ఇక్కడ పాడుపడిన అన్ని బావులకు త్వరలో అవసరమైన రక్షణ చర్యలు తీసుకుంటాం. ఇందులో భాగంగా అన్ని బావులపైనా ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తాం. దీనివల్ల ఆత్మహత్యలతో పాటు ప్రమాదాలు కూడా జరగకుండా నివారించడానికి అవకాశం ఉంటుంది. – జి. చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

వినాయక ఉత్సవాలకు రాట ఏర్పాటు



వినాయక ఉత్సవాల మండపం నిర్మాణానికి రాట వేస్తున్న రమణ

ఆనందపురం : లొడగలవానిపాలెంలో వినాయక ఉత్సవాల మండపం నిర్మాణానికి స్థానిక సర్పంచ్ లొడగల రమణ బుధవారం ఉత్సవ రాట వేశారు. ఉత్సవాలను ఐదు రోజులు పాటు నిర్వహించనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.సన్యాసిరావు, ఎం.ఎస్.నారాయణ, ఎల్.రమణ పాల్గొన్నారు.

వరిపైరు పెరుగుదలకు కాలిబాటలు దోహదం



రైతులకు వరి సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఆనందపురం : వరినాట్లు వేసిన అనంతరం పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేస్తే వరి పైరు పెరుగుదలకు దోహదపడుతుందని వ్యవసాయాధికారిని బి.శివకోమలి చెప్పారు. బోని, ముకుందపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివకోమలి మాట్లాడుతూ నాట్లు వేసిన అనంతరం ప్రతి రెండు మీటర్లకు 20 సెంటిమీటర్లు వెడల్పున కాలిబాటలు వేయాలన్నారు. వంద శాతం రాయతీ పై జింక్ సల్ఫేట్, పొలంలో గట్లు పై వేయడానికి కంది విత్తనాలను సిద్ధం చేసి ఉంచామని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీను, ఉద్యానవశాఖ ఎంపీఈఓ రత్న కుమారి పాల్గొన్నారు.

లైట్లను సరిచేయరూ



చెట్టుకు కట్టి ఉన్న వీధి లైటు



స్తంభానికి వేలాడుతున్న వీధి లైటు

కొమ్మాది (మంగమారిపేట): కె.నగరపాలెం పంచాయతీ మంగమారిపేటలో కొన్ని చోట్ల వీధి లైట్లు చెట్లకు.. మరికొన్ని చోట్ల స్తంభానికి వేలాడుతూ ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. ఈ లైట్లు వెలగక చీకటి సమయాల్లో నానాఅవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మంగమారిపేట నుంచి భీమిలి రహదారుల విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం కోసం మూడు అడుగుల గోతులు తవ్వగా ఈ లైట్లు వెలగక పోవడంతో చీకటిలో అనేక సార్లు పడిపోయి తీవ్ర గాయాలు అయిన సందర్భాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి లైట్లను సరిచేసి బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'పాండ్రంగి పాఠశాలను దత్తత తీసుకున్న కోరమండల్'



మాట్లాడుతున్న కాళిదాస్ ప్రమాణిక్

పద్మనాభం: అల్లూరికి జన్మనిచ్చిన పాండ్రంగి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని కోరమండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కాళిదాస్ ప్రమాణిక్ అన్నారు. పాండ్రంగి ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాళిదాస్ ప్రమాణిక్ మాట్లాడుతూ కోరమండల్ సంస్థ తరపున పాఠశాలలో విద్యార్థులకు శుద్ధి చేసిన జలాలను సరఫరా చేసేందుకు ఆర్‌వో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు తరగతి గదుల గోడలకు రంగులు వేయిస్తామన్నారు. కుర్చీలు, బెంచీలు ఇస్తామన్నారు. ఎఎన్‌ఎం సబ్ సెంటర్‌కు కుర్చీలు, బల్లలు, బెడ్లు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు. కోరమండల్ ఇంటర్‌నేషనల్ లిమిటిడ్ వైస్ ప్రెసిడెంట్ బి.వి.సుబ్బారెడ్డి, సర్పంచ్ ఆర్.ఎస్.వజ్రకుమార్‌రాజు, హెచ్‌ఎం బి.వి.పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



శిర్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న యునిసెఫ్ ప్రతినిధులు

ఆనందపురం : చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల చాలా అనర్థాలు చోటు చేసుకుంటాయని ఐసీడీఎస్ ఏరియా సూపర్‌వైజర్ ఎన్.వి.పార్వతి చెప్పారు. మండలంలోని శిర్లపాలెంలో బుధవారం యునిసెఫ్ ప్రతినిధులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, వాటిని ప్రోత్సహించే వారి పై కఠిన చర్యలు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు యుక్తవయసుకు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలంటూ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, యునిసెఫ్ ప్రతినిధులు ఇ.మరిడేష్, మజ్జి శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


మాఫీ చేస్తామని... నోటీసులిచ్చారు



తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

- రుణమాఫీ ప్రకటిస్తేనే బకాయిలు కట్టలేదు
- వడ్డీ పెంచి తీర్చమంటే ఏం చేయగలం?
- తహసీలార్దార్‌ను ఆశ్రయించిన రైతులు

అచ్యుతాపురం : అసలే అప్పులు దొరక్క, ఖరీఫ్ సాగుకు నానాయాతన పడుతుంటే ఈ సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వమే రైతుల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోందని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ఎరువులు, విత్తనాలు, కూలీల కొరత, పెట్టుబడికి రుణాలు లభించక సతమతమవుతుంటే సందెట్లో సడేమియా అన్నట్లు పాత అప్పులు తీర్చాలని పీఏసీఎస్‌లు నోటీసులు జారీచేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏమి చేయాలో తెలీక రైతులు నోటీసులతో తహసీల్దార్‌ను ఆశ్రయించారు.



పీఏసీఎస్ నుంచి అందిన నోటీసులు

అసలు కంటే వడ్డీ అధికం : పెదపాడు పీఏసీఎస్‌లలో కొంతకాలంగా బకాయిలను పట్టించుకోకుండా సరిగ్గా నాట్లువేస్తున్న సమయంలో నోటీసులు పంపడంపై రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి అప్పులు రెట్టింపు చేశారని, దీంతో వాటిని తీర్చడం భారంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. అసలు కంటే వడ్డీ అధికమైందని, ఇప్పుడెలా తీర్చాలని గగ్గోలు పెడుతూ బకాయి వివరాలను తహసీల్దార్‌కు తెలిపారు.

మాఫీ చేయాలని వినతి : సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని అదుకోవడానికి రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. 2013లో మాఫీ చేస్తామని ప్రకటించారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుంటే ఇప్పుడు వడ్డీ పెంచి నోటీసులిచ్చారు. అప్పటివరకూ ఏటా వడ్డీ జమచేసే వాళ్లమని, మాఫీ ప్రకటన తర్వాతే రుణాలు చెల్లించడం మానేశామని రైతులు గోడు వెల్లబుచ్చుతున్నారు. రుణమాఫీ చేయకపోగా, అప్పటినుంచి పెరిగిన వడ్డీని రైతులనుంచి వసూలుచేయడం అన్యాయమని, తమకు రుణ విముక్తి కలిగించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

నోటీసుల్లో పేర్కొన్న రుణ వివరాలు

పేరు	తీసుకున్న రుణం	ప్రస్తుత బకాయి (వడ్డీతో కలిపి)
రొబ్బా అమ్మలు	రూ.6148	రూ.10,801
శానాపతి సన్యాసమ్మ	రూ.9,102	రూ.20,110
శానాపతి నూకరాజు	రూ.33,307	రూ.74,050
రొబ్బా సాంభమూర్తి	రూ.30,040	రూ.52,702



చవితికి స్పెషల్స్

- 12 బస్సులు, 4 రైళ్లు
- నేటి నుంచి అందుబాటులోకి..

సాక్షి, విశాఖపట్నం:

వినాయక చవితి సందర్భంగా అటు ఆర్టీసీ, ఇటు రైల్వే ప్రత్యేక బస్సులను నడపనున్నాయి. చవితి శుక్రవారం రావడం, ఆ మర్నాడు శని, ఆదివారాలు కావడంతో వరసగా మూడు రోజుల పాటు సెలవుల వల్ల పలువురు తమ స్వగ్రామాలకు పయనమవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ విశాఖ నుంచి హైదరాబాద్‌కు 12, విజయవాడ, తదితర దూర ప్రాంతాలకు మరికొన్ని ప్రత్యేక బస్సులను నడపనుంది. రైల్వే శాఖ విశాఖ–సికింద్రాబాద్, తిరుపతి–విశాఖల మధ్య 4 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. గురువారం సాయంత్రం 4 గంటలకు చెన్నై నుంచి సూపర్ లగ్జరీ, 3.45 గంటలకు బెంగళూరు విశాఖపట్నానికి గరుడ ఏసీ సర్వీసు, సాయంత్రం 6 గంటల తర్వాత హైదరాబాద్ అశోక్‌నగర్, బీహెచ్‌ఈఎల్ నుంచి ఒక గరుడ, 5 సూపర్‌లగ్జరీ, 4 అల్ట్రా డీలక్స్ బస్సులు బయలుదేరనున్నాయి. అలాగే 27న విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి చెన్నైకి సూపర్‌లగ్జరీ, హైదరాబాద్‌కు 6 సూపర్‌లగ్జరీలు, 4 అల్ట్రా డీలక్స్‌లు నడపనున్నారు. విజయవాడకు 2 మెట్రో లగ్జరీ ఏసీ బస్సులు, 2 సూపర్‌లగ్జరీలు, 6 అల్ట్రా డీలక్స్ బస్సులు, అమలాపురానికి 2, భీమవరం, నర్సాపురాలకు రెండేసి చొప్పున అల్ట్రా డీలక్స్‌లు నడుపుతారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా కల్పించామని విశాఖ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సుధేష్‌కుమార్ తెలిపారు. రోజూ వివిధ దూరప్రాంతాలకు యథావిధిగా సర్వీసులు కొనసాగుతాయని చెప్పారు.

నాలుగు ప్రత్యేక రైళ్లు..

వినాయక చవితి పండగతో పాటు వరస సెలవుల దృష్ట్యా విశాఖ–సికింద్రాబాద్, తిరుపతి–విశాఖల మధ్య రైల్వే శాఖ కూడా నాలుగు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.

అంధ బాలికల పాఠశాల సందర్శన

- బాలికలతో సంక్షేమ శాఖ కమిషనర్ చక్రవర్తి మాటామంతీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కమిషనర్ చక్రవర్తి

సాగర్‌నగర్ (విశాఖ తూర్పు): బీచ్ రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల సేవలు ప్రశంసనీయమని విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ కె.ఆర్.బి.హెచ్.ఎన్.చక్రవర్తి అన్నారు. బుధవారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏటా పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం, విద్యార్థులకు సరిపడా అన్ని సౌకర్యాలు కల్పించడానికి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, డార్మిటరీ, డైనింగ్ హాల్, తరగతి గదులను సందర్శించారు. తర్వాత విద్యార్థులతో ముచ్చటించారు. ఆరోగ్యం, విద్యా బోధన, సౌకర్యాలు, తల్లిదండ్రులు వృత్తి వంటి విషయాలపై బాలికలకు కుశల ప్రశ్నలు వేశారు. బాలికలు కూడా ఉల్లాసంగా ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం పాఠశాల సిబ్బందితో కూడా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మొత్తం 11 మంది అవసరం కాగా.. 8 పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తక్షణమే ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలకు దివీస్ ల్యాబ్‌రేటరీ అందిస్తున్న సేవలను కమిషనర్ ప్రశంసించారు.

నూకాంబిక ఆలయ విస్తరణకు మాస్టర్‌ప్లాన్



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అమన్‌రాజు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో నూతన భవన నిర్మాణాల కోసం స్తపతి (గోపురం డిజైనర్)అమన్‌రాజు బుధవారం పర్యటించారు. బెజవాడ కనకదుర్గమ్మ ఆలయ తరహా అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని తీర్చిదిద్దేందుకుగానూ కొలతలు తీసుకున్నారు. ఇటీవల అనకాపల్లి నూకాంబిక ఆలయ విస్తరణకు అదనపు స్థలాన్ని కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు నూతన భవనాల నిర్మాణం, రహదారుల కోసం మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించడంతోపాటు డిజైన్ల కోసం స్తపతి(డిజైనర్) ఆలయ సిబ్బందితో మాట్లాడారు. ఆలయ పరిసరాల్లో పర్యటించి భవన నిర్మాణాలు, డిజైన్లపై ఒక అంచనాకు వచ్చారు. దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, మురళీ పాల్గొన్నారు.


డిటెన్షన్ విధానంతో విద్యార్థులకు చేటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకటరెడ్డి

సీతమ్మధార (విశాఖ ఉత్తరం): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టేందుకు తీసుకున్న నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు నష్టం కలిగించేలా ఉందని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విధానం అమలపై రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కనీసం తల్లిదండ్రులతో చర్చించకుండా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి బాలల్లో అభద్రతా భావాన్ని నెలకొల్పిందన్నారు. దీనిపై సీఆర్పీఎఫ్ దేశ వ్యాప్తంగా చర్చలు, సభలు, పెడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తోందన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం మాట్లాడుతూ డిటెన్సన్ విధానంపై నగరంలో మేధావుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానం అమలు చేస్తే మొత్తం విద్యా వ్యవస్థకు చేటు వాటిల్లుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు ఎంవీరావు, సైకాలజిస్టులు డాక్టర్ జయప్రకాష్, బి.రమేశ్‌బాబు, చిన్న పిల్లల వైద్య నిపుణులు ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నబోయిన సూరీడు!



దట్టమైన మంచుతెరలను చీల్చుకువస్తున్న ప్రభాత భానుడు పచ్చని చెట్లు.. ఆపై దట్టమైన మంచుతెరల మాటున చీల్చుకు వచ్చే సూరీడి లేలేత కిరణాలు స్వర్ణకాంతులు వెదజల్లాయి. కోడి కూసి ఆరు గంటలు దాటినా ప్రభాత భానుడు మంచుదుప్పట్లో మసకబారి చిన్నబోయాడు. ఆంధ్రా ఊటీ అరకులోయలో బుధవారం ఉదయం దట్టంగా మంచుకురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచు కురవడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులతోపాటు పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విశాఖ-అరకు రహదారిలో వాహన చోదకులు లైట్లు వేయందే బండి కదలని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఉదయం 9 గంటల సమయం తర్వాత సూరీడు మెలమెల్లగా మంచు తెరలను తెంచుకుని బయటికొచ్చాడు. - అరకులోయ



సంపత్ వినాయక వైభవం

- నవరాత్రి ఉత్సవాలకు ఆలయం సన్నద్ధం
- రోజూ ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనం
- భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు



సంపత్ వినాయగర్

ద్వారకానగర్ (విశాఖ దక్షిణం): నగరంలో ప్రసిద్ధి చెందిన సంపత్ వినాయగర్ ఆలయంలో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 25 నుండి సెప్టెంబర్ 2 వరకు జరగనున్న ఉత్సవాల కోసం ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు సాగుతున్నాయి. నవరాత్రి వేడుకల్లో భాగంగా నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలే కాకుండా, వివిధ స్తోత్ర పారాయణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక అంశాలు జరగనున్నాయి.

వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఆలయంలో ఉదయం 4 గంల నుండి 6 గంటల వరకు స్వామివారికి గణపతి హోమం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు. 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనం, అలాగే ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి.

26న స్వామి ' బాలగణపతి' అలంకరణలో దర్శనం ఇస్తారు. ఆరోజు నుంచి నుండి 2 వ తేదీ శనివారం వరకు ఉదయం 6 గంటల నుంచి సర్వ దర్శనం, 7 గంటల నుండి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయి. 27న 'ఆదిగణపతి' అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 28న 'విద్యా గణపతి' ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. 29న 'గణేశని' అలకరణలో భక్తులకు దర్శనమిస్తారు. 30న 'స్కంద గణపతి' అలంకరణలో దర్శనమిస్తారు.31న 'శివపూజ గణపతి' అలంకరణ ఉంటుంది.2న 'లక్ష్మి గణపతి ' అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

రేపటి నుంచి దుర్గాగణపతి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ రాజగోపాల్

సీతంపేట(విశాఖ ఉత్తర): సీతంపేట కూడలిలో కొలువైన దుర్గా గణపతి ఆలయంలో శుక్రవారం నుంచి చవితి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నటుట్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గూడూరు రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆలయంలో ఉత్సవాల ప్రచార కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఏటా ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రోజుకొక అలంకరణలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 25న వెండి కవచం, ఆభరణాల అలంకరణ, 26న విష్ణు గణపతిగా, 27న ఆదిత్య గణపతిగా, 28న శివబాల గణపతిగా, 29న స్కంద గణపతిగా, 30న త్రిముఖ గణపతిగా, 31న విద్యా గణపతిగా, వచ్చే నెల 1న లక్ష్మీ గణపతిగా, 2న అర్ధనారీశ్వర గణపతిగా స్వామి దర్శనమిస్తారని తెలిపారు. 3న సిద్ధి బుద్ధి అలంకారంలో ఉత్సవ విగ్రహాల భారీ ఊరేగింపుతో వేడుకలు ముగిస్తాయన్నారు. రోజూ సాయంత్రం 5.30 గంటల తర్వాత ప్రత్యేక అలంకరణలో దుర్గాగణపతిని భక్తులు తిలకించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సేవా కమిటీ ప్రతినిధులు ఇమంది రమణ, కురిటి సత్యంనాయుడు, వంకాయల మారుతీప్రసాద్, డి.రామదాస్, ఎం.వెంకటరావు, జె.అనంతరామ్ పాల్గొన్నారు.



గణేశ స్ఫూర్తి మంత్రం

ఇష్టసిద్ధి

అష్టసిద్ధులతో చిన్నారుల్లో నవోన్మేషం

వినాయకుడు ముక్కోటి దేవతల్లో పూజలు అందుకునే అగ్రగణ్యుడు. సద్గుణాల రాశి. సర్వ లక్షణ లక్షితుడు. పలు అంశాల్లో మార్గదర్శి. ఆయనలోని విశేష లక్షణాలు బాలలకు అనుసరణీయం. పిల్లలకు వినాయకుడంటే చాలా ఇష్టం. శుక్రవారం వినాయకచవితి సందర్భంగా అష్టగణపతిపై 'సాక్షి' కథనం.

- కంచరపాలెం (విశాఖఉత్తర)

బుద్ధిబలం..



భుజబలం కంటే బుద్ధిబలం మిన్న. ముల్లోకాలను చుట్టివచ్చే విషయంలో వినాయకుడు దీనినే ఉపయోగించాడు. తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణ చేసి కుమార స్వామికంటే మిన్నగా నిలిచాడు. పిల్లలకు ఇదే విషయం చెప్పాలి. ఎలాంటి సమస్యనైనా బుద్ధిబలంతోనే ఎదుర్కోవాలి. చదువుల్లో వెనుకబడితే మందలించడం, కొట్టడం చేయకుండా తెలివిగా ఎలా ముందుకెళ్లాలో పిల్లలకు నేర్పించాలి. ఇష్టపడి చదివితే ఏ మార్గాన్ని ఎంచుకున్నా అవలీలగా విజయం సాధించవచ్చని తెలియజెప్పాలి.

వినమ్రతే ఆభరణం...



లంబోదరుడు సకల విద్యా పారంగతుడు. ముక్కోటి దేవతల్లో మొదటి పూజ తనకే జరుగుతున్నా అహంకరించని తత్వం గణపతిది. తల్లిదండ్రులు, పెద్దలపట్ల వినమ్రత ఆయనకున్న గొప్ప సుగుణం. పిల్లలు కూడా దీనిని అలవరచుకునేలా తల్లులు మార్గదర్శనం చేయాలి. నలుగురు కాస్త పొగడగానే తనంతటి వాడు లేడనే భావన రాకూడదని చెప్పాలి. ఈ భావన వ్యక్తి పురోగతిని అడ్డుకుంటుందని నూరిపోయాలి. ఉన్నత శిఖరాలు ఎన్ని అధిరోహించినా కన్నవారిని, సొంత ఊరిని, దేశాన్ని మరువరాదని హితబోధ చేయాలి.

కళల్లోనూ రాణించాలి...

ఏ రంగంలోనైనా మనకంటూ ప్రత్యేకత ఉండాలి. అప్పుడే గుర్తింపు వస్తుంది. వినాయకుడు అనేక కళల్లో దిట్ట. నాట్య గణపతిగా, సంగీత గణపతిగా, ఇలా వివిధ రకాలుగా కొనియాడతారు. పిల్లలు కూడా చక్కటి ప్రతిభ చాటాలి. సంగీతం, నాట్యం, వాయిద్యాలు, నటన, తదితర రంగాల్లో ఆసక్తి ఉందో గమనించాలి. జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న వారూ చిన్నారులకు ఆదర్శంగా చూపించాలి.







జెండాపై కపిరాజు



వేట చక్కగా జరిగేందుకు ఏర్పాటు చేసుకున్న నలు... రంగు జెండ... బోట్లు

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ):

రామాయణ, మహాభారత కాలంలో యుద్ధానికి బయలుదేరి వెళ్లే రథాలపై జెండాలు ఎగిరేవి. రథంలో ఉన్న వీరుడి బలానికి, విజయానికి సంకేతంగా జెండాలు ఉండేవి. జెండాపై ఉన్న గుర్తును బట్టి అందులో ఎవరున్నారనే విషయాన్ని ఇతరులు సులభంగా గుర్తుపట్టేవారు. ప్రస్తుతం ఏ వాహనం మీద జెండాలు ఎగరడం లేదు..కాని చేపల వేట నిమిత్తం సముద్రంలోకి వెళ్లే ప్రతి బోటుమీద జెండా, జాతీయ జెండాలు తప్పనిసరిగా ... ర్జాతీయ జలాలు, భారత... జలాల్లో ఉన్నపుడు భారత... అధికారులు జాతీయ జె... బోట్లు భారతదేశానికి చె... గుర్తిస్తారు. అదేవిధంగా ... అన్ని బోట్లమీద జాతీయ ... జెండా,

...సాధ్యుడు....



...ాషిక వాహనుడు అసాధ్యుడు. ఆయనకు సాధ్యం కానిది ...లేదు. మహా భారతంలోని 18 పర్వాలను ఆగకుండా రాయ ...వా అన్న వ్యాసుడికి తానేంటో నిరూపించాడు. బాలలు ...డా దేనినైనా సుసాధ్యం చేయాలి. సవాళ్లను స్వీకరించాలి. ఆ ...్యం చేరే వరకు విశ్రమించకూడదు. చిన్ననాటి నుంచే పిల్లల్లో ...్లులు పట్టుదల అలవరచాలి. అప్పుడే సమున్నత సంకల్పాలు సాకారమవుతాయి. ప్రముఖులు ...యా రంగాలో సాధించిన విజయాలే ఇందుకు ఉదాహరణగా పిల్లలకు చూపాలి.

అందమూ..ఆరోగ్యం



ఏకదంతుడు చక్కటి రూపవంతుడు చూడముచ్చట గొలిపే ఆకారం ఆయన సొంతం. బాలలను కూడా ఇలాగే పెంచాలి. సరైన వేళకు పిల్లలకు ఆహారం అందించాలి. పౌష్టికాహారం ఎప్పటికప్పుడు ఇవ్వాలి. పిజ్జాలు, బర్గర్ల సంస్కృతికి దూరంగా ఉంచాలి. అలాంటి ఆహారం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్గించాలి. షుగర్, బీపీ, కీళ్ల నొప్పుల బారిన పడుతున్న చిన్నారులు ఎందరో ఉన్నారు. వారి గురించి సున్నితంగా వివరిస్తూనే ఆరోగ్యంపై పిల్లలకు అవగాహన కల్గించాలి. ఆరోగ్యంగా ఉన్నప్పుడే అందం సొంతం అవుతుందని చెప్పాలి.

...తి ప్రేమికుడు...



...తుడు ప్రకృతి ప్రేమికుడే. ఔషధ గుణాలెన్నో ఉండే పత్రితోనే ...ాడు మనం పూజిస్తాం. ఈ రహస్యాన్ని తెలియజేయడమే పూజ ...ద్దేశం కూడా అందుకే మనం ప్రకృతిని పరిరక్షించాలి. ప్రస్తుతం ఈ ...లేక ఎన్నో అనర్థాలను ఎదుర్కొంటున్నాం. చిన్ననాటి నుంచే పర్యా ...పరిరక్షణ అవసరాన్ని తెలియజెప్పాలి. ఈ అంశంపై చిత్ర లేఖనం, ..., వంటి పోటీల్లో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించాలి.

పరాక్రమం..



గణపతి అమిత పరాక్రమవంతుడు. దీని ద్వారానే శిష్టసంరక్షణ చేశాడు. పిల్లలు అలాగే ఉండాలి దేనినైనా ఎదుర్కొగలగాలి. ఆపదలు చెప్పిరావు అవి ఎదురైనప్పుడు దైర్యంగా ఎదుర్కొవాలి. సాహసవంతుల కథలను తల్లులు తరుచూ వినిపించాలి. వారి వల్ల సమాజానికి జరిగిన మేలు విడమరచి చెప్పాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎందరో చిన్నారులు ప్రాణాలకు తెగించి ఆపదలో ఉన్న వారిని రక్షించారు. తద్వారా ఎన్నో కుటుంబాలను నిలబెట్టారు.

సకలశాస్త్ర కోవిదుడు...



వినాయకుడు సకలశాస్త్ర కోవిదుడు. ఆయన స్ఫూర్తిగా పిల్లలూ చదువుల్లో రాణించాలి. కలలు కంటూ వాటిని సాకారం చేసుకునే ప్రయత్నమూ చేయాలి. పలువురు శాస్త్రవేత్తల గురించి చెప్పడం ద్వారా పిల్లల్లో పోటీతత్వం పెంచండి. నేటి చదువు రేపటి భవితకు మేలిమలుపు అనే విషయం మరువకండి.



ఓ మట్టి గణపయ్యా..

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు):

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి బుధవారం గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. గాయత్రి సంస్థల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల్లో సృజనాత్మకత, ప్రకృతి వనరుల పరిరక్షణ, భారతీయ సంస్కృతి, నాగరికతపై అవగాహన కల్పించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధర రాణి మాట్లాడుతూ పెరిగిపోతున్న రసాయనాలకు వీడ్కోలు పలికి, పర్యావరణానికి మేలు చేసే విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పి.సునీత, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక భావాలు పెరుగుతాయి

మట్టిబొమ్మల తయారీ వలన సృజనాత్మక భావాలు పెరుగుతాయి. కాలుష్య కారకాలపై మార్గంగా వుండడం. వివిధ రసాయనాల వలన జరిగే ప్రమాదాన్ని నివారించవచ్చు. అందుకే ఈ శిబిరంలో పాల్గొన్నారు.

–పవన్, 7వ తరగతి



ప్లాస్టిక్ వద్దు

విశాఖ నగరం శరవేగంలో విస్తరిస్తోంది. ఆధునికత పేరుతో ప్లాస్టిక్ వినియోగానికి అడ్డూ, అదుపు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఈ శిక్షణ శిబిరం నిర్వహించడం చాలా బాగుంది. అందరూ మట్టి వినాయకుడ్ని పూజించాలి.

–సాత్విక, తొమ్మిదో తరగతి



మట్టి ప్రతిమలే ముద్దు



మట్టి ప్రతిమలను అందిస్తున్న సతీష్ పొన్నం

పెదవాల్తేరు(విశాఖ తూర్పు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణనాథ ప్రతిమలకే పూజలు చేయాలంటూ సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ విద్యార్థులు ప్రచారం చేశారు. ఎకో ఫ్రెండ్లీ వినాయక చవతి వేడుకలను అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా శివాజీపాలెంలోని అకాడమీ వసతి గృహంలో మట్టి వినాయక ప్రతిమలను మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ పొన్నం ఉచితంగా పంపిణీ చేశారు.

...గురుతుంది. అంత ...దేశ సరిహద్దు ...తీయ కోస్ట్‌గార్డ్, నేవీ ...డా ద్వారా ఆయా ...దినవని ...దాదాపు

కపిరాజు జెండాలు ఎగురుతూ కనిపిస్తాయి. వీటితో పాటు తమ కుల దైవమైన గంగాదేవితో పాటు ఇతర దేవుళ్ల బొమ్మలు ఉన్న జెండాలను ఎగురుతుంటాయి. వేట చక్కగా సాగాలని, ఎవరి దిష్టి తగలకూడదన్న ఉద్దేశ్యంతో కొంతమంది నలుపురంగు జెండాలను ఏర్పాటు చేసుకుంటారు. అదేవిధంగా ప్రతి బోటుమీద ఎరుపు, తెలుపు, నీలం రంగు బల్బులను రాత్రి సమయంలో వెలిగించి ఉంచుతారు. చీకట్లో బోట్లు ఒక దానికి ఒకటి ఎదురైనా ప్రమాదం జరగకుండా ఉండేందుకు, ఆకాశంలో ఎగిరే విమానాలు దిగువగా వచ్చినపుడు చీకట్లో బోట్లను గుర్తించేందుకు ఎర్రని బల్బు ఉపయోగపడుతుంది. సముద్రజలాల్లో వేట సాగించే సమయంలో దూరంగా ఉన్న బోటు ఎవరిదో గుర్తించేందుకు జెండా ఉపయోగపడుతుందని బోటులో పనిచేసే కళాసీలు చెబుతున్నారు.



జెండాలు రెపరెపలాడుతుండగా వేటకు బయలుదేరిన బోటు





బోట్లపై రెపరెపలాడుతున్న భారత జాతీయ పతాకాలు

...పు ...లున్న



వరుణ విశాఖి

నగరంలో కొన్ని చోట్ల భారీ వర్షం

నగర వాసులపై వరుణుడు కరుణచూపాడు. కొన్ని రోజులుగా ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం కురిసిన భారీ వర్షం కారణంగా కొంత ఉపశమనం లభించింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు నగరానికి గొడుగు పట్టాయి. అనంతరం నగరంలో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. అప్పటివరకూ ఎండ ఉంటూ.. ఒక్కసారిగా వర్షం కురవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కొన్ని ప్రధాన రహదారుల్లో నీరు నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు యాతన పడ్డారు. మురళీనగర్, మాధవధార తదితర ప్రాంతాల్లోని వీధుల్లో మురుగు ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మురళీనగర్‌లో పిడుగు

మురళీనగర్‌లో భారీ వర్షంతో పాటు సాయంత్రం 4–30 ప్రాంతంలో పిడుగుపడింది. దీంతో కొంత సేపు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. కొన్ని ఇళ్లలో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. – విశాఖసిటీ









నేడు, రేపు భారీ వర్షాలు

అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్

సాక్షి, విశాఖపట్నం: రెండురోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు మండల కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలన్నారు. ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. సముద్ర తీర ప్రాంతాల్లోని మండల అధికారులు అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. ప్రమాద సూచిక ఎగురవేయాలని, చేపల వేటకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లనీయొద్దన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు

అన్ని తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. తక్షణ సహాయానికై కలెక్టరేట్‌లో ప్రత్యేకం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. టోల్ ఫ్రీ నెం. 1077, 1800–4250–0002, 9849913705, 0891–2735606, 2735665కు ఫోన్ చేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అప్పన్నను దర్శించుకున్న బాలకృష్ణ సతీమణి

సింహాచలం (పెందుర్తి): శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, ఇతర కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. కప్పస్తంభానికి మొక్కుకుని అంతరాలయంలో అష్టోత్తర పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. నాలుగు వేదాలతో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వసుంధర

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

సీతమ్మధార (విశాఖ ఉత్తరం): శంకమఠం నెహ్రూబజారుకు చెందిన బాలిక అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. బాలిక నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆ బాలికను ప్రేమ పేరుతో సీతమ్మధారకు చెందిన ఒక బాలుడు శనివారం తనతో తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు రంగంలోకి దిగి బాలికతో పాటు బాలుడిని కూడా బుధవారం పట్టుకున్నారు. నిందితుడు మైనర్ కావడంతో జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

భద్రాద్రికి... కాలినడకన

సీలేరు(పాడేరు): కలి యుగ దైవమైన భద్రాద్రి రాముడిని దర్శించుకునేందుకు వృద్ధులు కాలినడకన బయలుదేరారు. శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం రాంపురం గ్రామానికి చెందిన 11 మంది వృద్ధులు ఈనెల 12న గ్రామం నుంచి బయలుదేరిన ఆ భక్తులు బుధవారం సీలేరు చేరుకున్నారు. మొత్తం 550 కి.మీ. పాదయాత్రలో ఇప్పటికే 400 కి.మీ మేర కాలినడక ప్రయాణం ముగించారు. ఆదివారం నాటికి భద్రాచలం చేరుకుంటామని భక్తులు చెబుతున్నారు. అన్ని గ్రామాల్లో స్థానికులు వసతి, భోజనం కల్పిస్తున్నట్టు వారు చెప్పారు.



ఘాట్‌రోడ్డులో భద్రాద్రి వెళుతున్న భక్తులు

మూత్రగండం

అది ఖరీదైన రోగం..మందులకు, వైద్యానికి డబ్బులు ధారపోయాల్సిందే. అంత సొమ్ము ఖర్చు చేసినా ప్రాణానికి గ్యారెంటీ ఉండదు.నాలుగు ఐదు నెలల చికిత్స తరువాత ప్రాణాలు పోతున్నాయి. చేసిన అప్పులు మాత్రం ఉండిపోతున్నాయి. కుటుంబాలు కడు పేదరికంలోకి పోతున్నాయి. జీవితాలు అతలాకుతలమవుతున్నాయి. ఇదీ కొయ్యూరు మండలం బాలారంలోని కిడ్నీ రోగుల దుస్థితి. పేదలకు ప్రభుత్వ వైద్యం ఆశించిన స్థాయిలో అందడం లేదు. గ్రామంలో కిడ్నీలు పాడైన వారి సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. రెండేళ్లలో ఐదుగురు మరణించారు. ప్రస్తుతం ఆరుగురు మంచానపడి అల్లాడుతూ ఎప్పటికప్పుడు విశాఖపట్నం వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు.



- విలవిల్లాడుతున్న బాలారం
- రెండేళ్లలో ఐదుగురి మృతి
- మరో ఆరుగురు బాధితులు
- ప్రతినెలా చికిత్సకు విశాఖ వెళ్లాల్సిందే..

కొయ్యూరు (పాడేరు): కిడ్నీ వ్యాధి ఎందుకు గ్రామాన్ని పీడిస్తున్నదో తెలియక మండలంలోని బాలారం వాసులు వణికిపోతున్నారు. దీనికి అత్యంత ఖరీదైన వైద్యం చేయించాల్సి రావడంతో అల్లాడిపోతున్నారు. నర్సీపట్నాన్ని ఆనుకుని 15 మండలాలున్నాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రే వీరందరికీ పెద్ద దిక్కు. ఇక్కడ నెఫ్రాలజిస్టు(కిడ్నీ వ్యాధి నిపుణుడు) లేరు. ఈ వ్యాధిగ్రస్తులంతా విశాఖపట్నం వెళ్లి వైద్యం పొందాల్సిందే. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన ప్రతిసారీ రూ. ఐదు నుంచి రూ.ఏడువేల వరకు ఖర్చవుతోంది. అదే నెఫ్రాలజిస్టు వారానికి ఒక్కరోజయినా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో సేవలు అందిస్తే ఈ ప్రాంత రోగులకు మేలు జరుగుతుంది.

రెండేళ్లుగా పెరుగుతున్న బాధితులు..

బాలారంలో రెండేళ్లుగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఇలా ఎందుకు జరుగుతోందో తెలుసుకునేందుకు వైద్యాధికారులు కూడా ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదు. తాగు నీటి కలుషితమే ఇందుకు కారణమన్న వాదన వ్యక్తమవుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులూ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.ఫలితంగా కిడ్నీ బాధితులు పెరుగుతున్నారు. బాలారంకు చెందిన వానపల్లి అప్పారావు, నీలం చిన నూకరాజు, మాకిరెడ్డి అప్పలనాయుడు, వానపల్లి పెదరమణలు ఈ వ్యాధి బారినపడి మూడుసార్లు డయాలసిస్ చేయించుకున్నాక రెండేళ్ల వ్యవధిలో మరణించారు. ప్రస్తుతం మరో ఆరుగురు బాధితులు విశాఖపట్నంలో నెఫ్రాలజిస్టులకు చూపించుకుని మందులు వాడుతున్నారు. నెల నెలా విశాఖకు వెళ్లాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మరో వైపు ప్రభుత్వం డయాలసిస్ స్టేజి వారికి తప్ప మిగిలిన వారికి పింఛన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వలేదు.

రూ.4 లక్షలు అప్పచేశాం..



నా తమ్ముడు మాకిరెడ్డి అప్పలనాయుడుకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. మూడుసార్లు విశాఖపట్నంలో డయాలసిస్ చేశారు. అతని వైద్యం కోసం రూ. నాలుగు లక్షలు అప్పు చేశాం. అయినా అతడ్ని బతికించుకోలేక పోయాం. ఇప్పుడు నాకూ కిడ్నీలు పాడయ్యాయి. ప్రతీ నెలా విశాఖపట్నం వెళుతున్నాను. నెలకు రూ.ఐదు వేలకు పైనే ఖర్చవుతోంది. కూలికి వెళ్తేనే కడుపు నిండుతుంది. ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు.
– మాకిరెడ్డి వెంకినాయుడు, బాలారం

కష్టాలు తప్పడం లేదు..



ప్రతి నెలా విశాఖపట్నం వెళ్లడం కష్టమవుతోంది. అక్కడికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాను. వైద్యులు ఆ రిపోర్టును పరిశీలించి మందులు ఇస్తున్నారు. నెలకు రూ.మూడు నుంచి రూ.నాలుగు వేల వరకు ఖర్చవుతోంది. నిరుపేదలమైన తాము అంత డబ్బు ఖర్చు చేయడం సాధ్యం కావడం లేదు. చెప్పలేని కష్టాలు పడుతున్నాం. రోజుకు పదికి పైగా మాత్రలు వేసుకోవలసి వస్తోంది
– నీలం గంగరాజు, బాలారం

దోమలపై కొరడా!



నగరవాసులను ముప్పతిప్పలు పెడుతున్న దోమలకు చెక్ పెట్టడానికి యంత్రాంగం కృషిచేస్తోంది. దోమ కాటు వల్ల వచ్చే దుష్పలితాలను కట్టడి చేయడానికి కసరత్తు ప్రారంభించింది. దోమల నివారణకు ముంబై ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం, పూణేలోని పింప్రి చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో అమలు చేస్తున్న కార్బన్ డయాక్సైడ్ ఆధారిత యంత్రపరికరాలను విశాఖ నగరంలో ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

- కార్బన్‌డయాక్సైడ్ విసర్జించే యంత్రాల ఏర్పాటుకు యోచన
- ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నలే తరువాయి

సాక్షి, విశాఖపట్నం:

నగరాలు, పట్టణాల్లో దోమల బెడదతో ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాల బారిన పడుతున్నారు. వాటి నివారణకు చర్యలు చేపట్టినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కార్బన్ డయాక్సైడ్ ఆధారిత యంత్రపరికరాలన తయారీ సంస్థను విశాఖతో పాటు విజయవాడలోనూ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

ఇదీ పరిస్థితి: మహానగరంలో 32 హైరిస్క్ ప్రాంతాల్లో 800 చోట్ల దోమలు లార్వాలను ఉత్పత్తి చేసే ఏరియాలున్నట్టు జీవీఎంసీ వైద్య, ఆరోగ్య అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు చేపడుతున్నారు. ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఏటా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతూనే ఉన్నాయి. డెంగ్యూ, చికున్‌గున్యాలకు కారకమయ్యే ఎడిస్ ఈజిప్టియా, మలేరియాకు దోహదపడే ఎనాఫిలిస్, మెదడు వాపు వ్యాధికి కారణమయ్యే జపనీస్ ఎన్సెఫలిటిస్ దోమల ఉధృతి నగరంలో విస్తృతంగా ఉంది. ఏటా ఈ దోమకాటుతో వేలాది ఆస్పత్రుల పాలవుతున్నారు. మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా నగరంలో 83 డెంగ్యూ, 350కి పైగా మలేరియా, 35 చికున్ గున్యా కేసులు నమోదయ్యాయి.



దోమల నివారణ యంత్రం

యంత్రాల పనితీరు ఇలా..

దోమలు మనుషుల శరీరం నుంచి విడుదలయ్యే చెమట, కార్బన్ డయాక్సైడ్ వాసనను ఆకర్షిస్తాయి. దీంతో అవి మనుషుల శరీరంపై వాలి రక్తం పీలుస్తాయి. దోమల నివారణకు ప్రతిపాదిస్తున్న కార్బన్ డయాక్సైడ్ ఆధారిత యంత్రాలు కూడా స్వల్ప ఉష్ణోగ్రతతో అలాంటి వాసననే విడుదల చేస్తాయి. వాటి కోసం దోమలు వచ్చి వాలుతాయి. ఈ యంత్రాలకు తేలికపాటి విద్యుత్ సరఫరా ఉంటుంది. దీంతో వాలిన వెంటనే షాక్‌తో దోమలు చనిపోతాయి. ఈ విద్యుత్ మరే ఇతర వాటికి ప్రమాదకరం కానంతగా స్వల్పంగా ఉంటుంది. ఒక్కో యూనిట్ ఖరీదు దాదాపు రూ.2 లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. అవసరమైనప్పుడల్లా వాటిలో కార్బన్ డయాక్సైడ్‌ను నింపుతారు. ఇందుకు నెలకు సుమారు రూ.2 వేల వరకు ఖర్చవుతుంది. ఈ దోమల నివారణ యంత్రాలు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లకు కూడా అనువుగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే విశాఖలో ఈ దోమల నివారణ యంత్రాల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

మృణ్మయ గణపతిని పూజిద్దాం



పోస్టర్ విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

ఏయూక్యాంపస్(విశాఖతూర్పు): మృణ్మయ గణపతిని పూజిస్తూ పర్యావరణ హితంగా నడుచుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు అన్నారు. వర్సిటీలో బుధవారం పర్యావరణ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేస్తున్న మృణ్మయ గణపతుల పంపిణీ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. మండపాల్లో సైతం మట్టితో చేసిన గణపతులను పూజించాలని సూచించారు. వర్సిటీ ఉద్యోగులంతా మట్టి గణపతిని పూజిస్తూ పర్యావరణ హితంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉద్యోగులకు మట్టి గణపతులను పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె.రాజేంద్రప్రసాద్, కమిటీ సభ్యులు ఒమ్మి నూకరాజు, బండారు దేముడు, పీతల అమరేంద్ర, సాయి బలరామ్, ఒమ్మివెంకట కృష్ణ, ఎస్.రామారావు, శేషు పాల్గొన్నారు.

8 లోగా వందశాతం వ్యాక్సినేషన్



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్, అధికారులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): తట్టు, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం, ఏజెన్సీ ప్రాంతంలో 70 శాతం పూర్తియిందని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌కు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని జిల్లా కలెక్టర్లతో సీఎస్ బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యాక్సినేషన్ సెప్టెంబరు 8లోగా వంద శాతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయనున్నామని సీఎస్‌కు తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి, హౌసింగ్ పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి ఆంధ్రకేసరి

జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



టంగుటూరికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): టంగుటూరి ప్రకాశం పంతులు తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి అని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ కొనియాడారు.టంగుటూరి జయంతి ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తుల్లో టంగుటూరి ప్రకాశం పంతులు ఒకరని అన్నారు. సాహసానికి, ధైర్యాన్ని మారు పేరు టంగుటూరి ప్రకాశం పంతులు, అందుకే ఆయన ఆంధ్రకేసరి గా పేరు గాంచారన్నారు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, 1953లో ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఆయన సేవలు కొనియాడదగినవని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సృజన, ఇన్‌చార్జి డీఆర్వో సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ భవానీ



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్,ఎమ్మెల్యేలు జెడ్పీటీసీ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ పిలుపు నిచ్చారు. ప్రకాశం పంతులు 145వ జయంతిని సందర్భంగా జెడ్పీ సమావేశపు హాలులో ఆయన చిత్రపటానికి చైర్‌పర్సన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.సృజన,జెడ్పీ సీఈఓ జయప్రకాష్ నారాయణ, ఎమ్మెల్యేలు పీలా గోవింద్, కిడారి సర్వేశ్వరరావు, జెడ్పీ ప్రతిపక్ష నాయకుడు చిక్కాల రామారావులతో పాటు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేసీ సృజన మాట్లాడుతూ ప్రకాశం పంతులు పరిపూర్ణమైన వ్యక్తిగతం గల నాయకుడని, విలువలకు నిలువెత్తు నిదర్శమన్నారు.

ఇద్దరు మిలీషియా సభ్యుల లొంగుబాటు



మిలీషియా సభ్యులు

గూడెంకొత్తవీధి(పాడేరు): ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు సీఐ నారాయణరావు, ఎస్ఐ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. మెట్టగూడ గ్రామానికి చెందిన గెమ్మెలి రాంబాబు, గెమ్మెలి కామేశ్వరరావు కొంతకాలంగా మావోయిస్టు పార్టీలో మిలీషియా సభ్యులుగా పని చేస్తున్నారని చెప్పారు. వీరిపై బైండోవర్ కేసు నమోదు చేసి వదిలి పెట్టినట్టు వారు తెలిపారు. కుంకంపూడి, ఎర్రగెడ్డ ప్రాంతాల్లో స్థూపాల నిర్మాణం, మావోయిస్టుల కరపత్రాలు వెదచల్లడంతోపాటు తీములబంద గ్రామంలో కాఫీ గొడౌన్ పేల్చివేసిన సంఘటనలో వీరు పాల్గొన్నారని చెప్పారు.

పంచదార అనుకుని యూరియా తిన్న చిన్నారులు

- చికిత్స పొందుతూ ఓ బాలిక మృతి
- ఆందోళనకర పరిస్థితిలో మరో చిన్నారి

హుకుంపేట(అరకులోయ):

పంచదార అనుకుని యూరియా తిన్న చిన్నార్లలో ఒకరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందగా, మరోబాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మండలంలోని పాతకోట పంచాయతీ,చింతలవీధి గ్రామానికి చెందిన బెటకరి మోదపల్లవి(4),బెటకరి మోదప్రియ(2)లు వరుసకు అక్కాచెల్లెళ్లు వీరిద్దరూ మంగళవారం ఉదయం 10గంటల సమయంలో ఇంటి వద్ద అన్నం తిని, తమ ఇళ్లకు సమీపంలోని ఇసుక దిబ్బ వద్దకు ఆడుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఇంటి వద్ద తల్లిదండ్రులు ఉంచిన యూరియాను పంచదార అనుకుని వీరిద్దరూ తిన్నారు. వారు యూరియా తిన్న సంగతి తల్లిదండ్రులకు తెలియలేదు. కొద్ది సేపటి తరువాత ఈ ఇద్దరు చిన్నారులు ఇంటికి వెళ్లి వాంతులు చేసుకోవడంతో డయేరియాగా భావించిన తల్లిదండ్రులు హుకుంపేట పీహెచ్‌సీకి తరలించి,అక్కడ నుంచి 108లో పాడేరు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.రక్తపు వాంతులు అవ్వడంతో హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు.కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మోదప్రియ(2) మృతిచెందింది.మృతదేహాన్ని రాత్రే చింతలవీధి గ్రామానికి తీసుకువచ్చారు. మోదపల్లవి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కేజీహెచ్ వైద్యులు చికిత్స చేస్తున్నారు.



చిన్నారి మోదప్రియ మృతదేహం

శోకసంద్రంలో చింతల వీధి

మోదప్రియ మృతిచెందడం, మోదపల్లవి ఆందోళనకర పరిస్థితుల మధ్య కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండడంతో చింతలవీధి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కొద్దిసేపటికి ముందే తన చేతితో గోరుముద్దలు తిన్న తమ గారాలపట్టి అంతలోనే తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందడంతో తల్లి శారద తల్లడిల్లిపోయింది. తండ్రి భీమన్న భోరున విలపించడంతో స్థానికులు కంటతడిపెట్టుకున్నారు. ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. సర్పంచ్ కొట్టగుల్లి లింగన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అనకాపల్లి క్రీడాకారిణి ప్రతిభ

అనకాపల్లి: పట్టణంలోని ఎస్ఎస్ఎస్ వ్యాయామ సంఘానికి చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి బి.శ్రీశరణ్య ప్రతిభ కనబరిచింది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో కేరళ రాష్ట్రం ఆల్‌పూజి జిల్లాలో జరిగిన సౌత్ ఇండియా చాంపియన్‌షిప్–2017 పోటీల్లో పాల్గొంది. జూనియర్స్ విభాగంలో 47 కేజీల విభాగంలో 295 కేజీల బరువునెత్తి ద్వితీయస్థానం సాధించింది. శరణ్య విజయం పట్ల సంఘ కోచ్ బి.బద్రీనాథ్, అంతర్జాతీయ క్రీడాకారిణి జాజుల రామలక్ష్మి, సంఘ సభ్యులు అభినందించారు.



మధురవాడ - రాముునాయుడు: 9010275754
పీఎంపాలెం-సత్యనారాయణ: 9505507672
పద్మనాభం-బంగారునాయుడు: 9640947827
కొమ్మాది-ఎంవీఎస్ బాపూజీ: 9666203555

జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక పర్యటన

- రోడ్లు, కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్,అధికారులు

పీఎంపాలెం : జీవీఎంసీ 4,5 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ హరినారాయణ్ బుధవారం ఆకస్మిక పర్యటన చేసి స్థానికుల ఇబ్బందులు తెలుసుకున్నారు. 4వ వార్డు సాయిప్రియ గార్డెన్, 5వ వార్డులోని బింద్రానగర్‌నగర్‌లలో పర్యటించారు. సాయిప్రియ గార్డెన్‌లో బాగా పాడైపోయిన రోడ్డు నిర్మాణానికి, బింద్రానగర్‌లో కాల్వల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బ్రిందానగర్ పార్కుకు రక్షణ గోడ నిర్మాణం చేసి రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాలరావు, జెడ్సీ సత్యవేణి, ఏసీపీ మధుసూదనరావు, డీఈ దిలీప్, ఏఈ భరణికుమార్ పాల్గొన్నారు.

చెత్తను వేరు చేయడం బాధ్యత



పోస్టర్ విడుదల చేస్తున్న జెడ్సీ, తదితరులు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరు తడి పొడి చెత్తలను వేరు చేయడాన్ని బాధ్యతగా తీసుకోవాలని జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు అన్నారు. ఇక్కడ నెహ్రూ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం తడి పొడి చెత్తకు సంబంధించిన ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. సిబ్బంది వచ్చేటప్పుడు తడి చెత్తను,పొడి చెత్తను వేరుచేసి అందించాలని కోరారు. ప్రతి రోజూ పాఠశాలలో దీని గురించి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఇందులో పారిశుధ్య అధికారి రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. ఈశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్లతో పిల్లలకు రక్షణ

ఆనందపురం : ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించడం వలన పిల్లలకు వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందని ఆరోగ్య కార్యకర్త ఎన్.మీనా కుమారి చెప్పారు. గొట్టిపల్లిలోని న్యూ లైఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలలు నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సిన్ వేయడం వల్ల తట్టు, పొంగు వంటి వ్యాధుల నుంచి పూర్తి రక్షణ లభిస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.జయశ్యామ్, డైరెక్టర్ శ్యామ్ మాథ్యూస్ ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హ్యుందాయ్ వెర్నా



వెర్నాను విడుదల చేసిన గోలివెంకట్, కస

మధురవాడ: హ్యుందాయ్‌లో సరికొత్త ఐదో జనరేషన్ వెర్నా మార్కెట్లోకి వచ్చేసింది. పీఎం పాలెంలోని మ్యాంగో హ్యుందాయ్ షోరూంలో డీటీసీ వెంకటేశ్వరరావు కొత్త వెర్నాను మార్కెట్లోకి బుధవారం విడుదల చేశారు. మ్యాంగో హ్యుండాయ్ ఎండీ గోలి వెంకట్ మాట్లాడుతూ జెన్ వెర్నా పెట్రోల్ మోడల్ ధర రూ.7.99 లక్షల నుంచి రూ.12.23 లక్షల శ్రేణిలోనూ, డీజిల్ మోడల్ ధర రూ.9.19 నుంచి రూ.12.61 లక్షల వరకూఅందుబాటులో ఉంటాయని తెలిపారు. తొలి 20 వేల మంది కొనుగోలు దారులకు మాత్రమే ఈ ప్రత్యేక ధరలు అందుబాటులో ఉంటాయనీ, తర్వాత ధరలు పెరుగుతాయని హ్యుందాయ్ ఏరియా సేల్స్ జనరల్ మేనేజర్ నరేన్ కస చెప్పారు. సేల్స్ హెడ్ కుమార్‌రాజా, వెర్నా కొనుగోలుదారులు వీఎస్ శివాజీరాజా, సీహెచ్ చంటి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి మేల్ తలపెట్టండోయ్

- విద్యార్థులు, యువకుల విస్తృత ప్రచారం
- ఉచితంగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

పర్యావరణ పరిరక్షణపై పలు సంఘాలు, విద్యార్థులు దృష్టిసారించాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు చెక్‌పెట్టి మట్టితో తయారు చేసిన గణపతులనే పూజించాలని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.ఉచితంగా మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్నారు.



మానవహారంలో భీమిలి డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఉప్పాడలో ప్రచారం నిర్వహిస్తున్న యువకులు

భీమునిపట్నం : మట్టి వినాయక విగ్రహాల వినియోగించడ వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గ్లోరీదయాకుమారి అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు మట్టివినాయ విగ్రహాల వినియోగంపై నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. మట్టి ప్రతిమల వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్న విషయాన్ని అందరూ గుర్తించు కోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. హరిప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల ఎంతోహాని కలుగుతుందన్నారు. అనంతరం చిన్నబాజార్, పెద్దబజారు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఇందులో ఎకో క్లబ్ కో- ఆర్డినేటర్ శామ్యూల్‌రాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

కొమ్మాది (ఉప్పాడ): వినాయకచవితి సందర్భంగా తీర ప్రాంత ప్రజలందరూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించాలని భీమిలి రూరల్ మండలం ఉప్పాడ యూత్ బాయ్స్ బుధవారం మట్టి విగ్రహాల ఆవశ్యకతపై ప్రచురించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినపుడు నీరు కలుషితమవుతుందని ఈ నీటిని తాగడం వలన మనుషులు, పశువులు, పక్షులకు కూడా హాని కలుగుతుందని వివరించారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకే మట్టి విగ్రహాలను వాడాలని వీరు కోరారు. కార్యక్రమంలో యువకులు దోని నాగరాజు, బి.గణేష్, అనీల్, సతీష్, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ

పద్మనాభం: మండలంలోని ఐనాడ పంచాయతీ యాతపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం విజయనగరానికి చెందిన సాయి దివ్యా దిత్యా చారిటబల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ సునీత మట్టి విగ్రహాలను, నైవేద్యం సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం యు.వి.వి.ప్రసాద్, సహోపాధ్యాయిని శ్రీవాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఐనాడలో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న సునీత

ధైర్యానికి మారుపేరు టంగుటూరి



సీవోఈలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ: తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం వివిధ ప్రాంతాల్లో జరిగాయి. వివేకానంద కాలనీ, అయ్యప్పనగర్‌లో డాక్టర్ తెన్నేటి విశ్వనాథం స్మారక సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మధురవాడలో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సభ తీర్మానించింది. దూర్వాసుల భాస్కర మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మల్లువలస జగదీశ్వరరావు, బీజేపీ నాయకులు బండారు అనీల్‌కుమార్,పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు యల్లపు ఈశ్వరరావు, ఘండికోట రాజేశ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ సీవోఈలో: మధురవాడ రిక్షాకాలనీలోని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకు ప్రతిభా పాఠశాల, కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. రూపావతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధైర్యశీలి మన ఆంధ్రకేసరి

ఆనందపురం : టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యానికి మారు పేరని నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక హైస్కూల్ హెచ్ఎం రవీంద్రబాబు మాచర్ల చెప్పారు. బుధవారం హైస్కూల్‌లో టంగుటూరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించి తుపాకీకి ఎదురెళ్లి గుండె చూపించిన ధీరోత్తముడని కొనియాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

లంగరుఖానా భూముల్లో మొక్కలు

భీమునిపట్నం: లంగరుఖానా సత్రం స్థలంలో వెయ్యి మొక్కలు నాటనున్నట్టు ఈవో పి.శేఖర్ బాబు తెలిపారు. 8 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా చదును చేసి అందులో దేవాత వృక్షాలైన రావి, వేప, కదంబం, నేరేడు, మారేడు మొదలైన వాటితో కలుపుకుని 27రకాలకు చెందిన వెయ్యి మొక్కలను నాటుతున్నామని చెప్పారు.

బ్రాహ్మణుల ఉన్నతికి కృషి



నియామక పత్రం అందుకుంటున్న కాళిదాసు

మధురవాడ:

జీవీఎంసీ 5వ వార్డు స్వతంత్రనగర్ సాయిబాబా ఆలయం అర్చకుడు, మధురవాడకు చెందిన అధికార్ల కాళిదాసు ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన సమావేశంలో ఈయన ఈ పదవికి ఎంపికయ్యారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బవర్‌లాల్ శర్మ, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జ్యోతి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

తాళ్లవలస పీహెచ్‌సీకి కూలర్లు, ప్యూరిఫయర్లు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఏఎన్ఎం సబ్‌సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు అవసరమైన చోట కూలర్లు, వాటర్ ప్యూరిఫైర్లు త్వరలో అందించనున్నట్టు భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ప్రతినిధి ఇ.ఎస్. నాగరాజు తెలిపారు. బుధవారం పీహెచ్‌సీ వైద్యురాలు ఎం. వెంకటలక్ష్మికి రూ.5వేల విలువైన అవుట్ పేషంట్ స్లిప్‌లు అందించారు. అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- 30 శాతం నాట్లు పడలేదు
- ఇంకా ప్రత్యామ్నాయం అంటూ మభ్యపెట్టొద్దు
- వ్యవసాయశాఖ తీరుపై సభ్యుల ఆగ్రహం
- ఎప్పటిలాగే డుమ్మాకొట్టిన మంత్రులు, మెజార్టీ ప్రజాప్రతినిధులు

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో డిమాండ్



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లాలం భవానీ

సాక్షి, విశాఖపట్నం: అదను దాటిపోయింది..నేటికీ 30 శాతానికి మించి నాట్లు పడలేదు. ఇంకా వర్షాలు పడతాయి. ఖరీఫ్ లక్ష్యం చేరుకుంటామంటూ రైతులను ఎందుకు మభ్యపెడుతున్నారంటూ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జూన్‌లో అధిక వర్షపాతం నమోదు కాగా, జూలై, ఆగస్టుల్లో లోటు వర్షపాతం ఉందని వ్యవసాయశాఖ జేడీ శివప్రసాద్ వివరించారు. ఈ ఏడాది 1.00,819 హెక్టార్లలో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 45,917 హెక్టార్లలో మాత్రమే సాగైందన్నారు. ప్రత్యామ్నాయం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని జేడీ చెప్పగా ఎమ్మెల్యే పీలా అభ్యంతరం తెలిపారు. వర్షాలన్నీ ఏజెన్సీలోనే పడ్డాయని, మైదానంలో లేవని, దీంతో కనీసం 30 శాతం కూడా నాట్లు పడలేదన్నారు. అలాంటప్పుడు ఇంకా వర్షాలు పడతాయంటూ ఎందుకు మాయమాటలు చెబుతున్నారని ప్రశ్నించారు. కరువు జిల్లాగా ప్రకటించాల్సిందేనన్నారు.

సీఎం హామీయే అమలు కావడం లేదు..

ఏజెన్సీలో రాజ్మా చిక్కుళ్ల 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవడం లేదని అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ఆరోపించారు. నేటికీ 25 శాతం రాయితీపైనే ఈ విత్తనాలు సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయశాఖ పనితీరు ఏమాత్రం బాగోలేదని ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ మూర్తి అన్నారు.

జిల్లా వ్యాప్తంగా సబ్ సెంటర్ల నిర్వహణ అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే పీలా గోవింద్ ధ్వజమెత్తారు. వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన సమీక్షలో ఎప్పుడు అడిగినా ఫీల్డ్ విజిట్ అంటూ వైద్యులు, సిబ్బంది తప్పించుకుంటున్నారని ఆరోపించారు. బయోమెట్రిక్ అమలు చేయాలని కోరగా జేసీ జి.సృజన తప్పకుండా అమలు చేయిస్తామన్నారు. నర్సీపట్నంలో 150 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి స్థానిక జెడ్పీటీసీకి ఆహ్వానం కూడా పంపలేదని జెడ్పీ ప్రతిపక్ష నాయకుడు చిక్కాల రామారావు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రొటోకాల్ ఉల్లంఘన ఎక్కడ జరిగిందో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్‌ను ఆదేశించారు.

పింక్ కార్డు ఎప్పుడిస్తారు?

తన కుమారుడు, కోడళ్లకు వేర్వేరుగా తెల్లకార్డులు జారీ చేశారని ఈ విషయాన్ని గత సర్వసభ్య సమావేశంలోనే మీ దృష్టికి తీసుకొచ్చానని, వాటిని రద్దు చేసి పింక్ కార్డు మంజూరు చేయాలని కోరి మూడు నెలలైనా ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు సివిల్ సప్లయిస్ అధికారులను నిలదీశారు. జెడ్పీ సీఈవో జయప్రకాష్ నారాయణ డీఆర్‌డీఏ పీడీ సత్యసాయి శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ నిర్మలాబాయిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మునగపాకలో 800 ఎకరాలు కబ్జా

మునగపాక మండలంలో సుమారు 800 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని సిట్‌కు కూడా ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టలేదని మునగపాక జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ ఆరోపించారు. మండలంలో ఐదు ప్రధాన చెరువులు మాయమై పోయాయని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. తహశీల్దార్, వీఆర్వోలు ఇష్టారాజ్యంగా రికార్డులు టాంపరింగ్ చేస్తూ ప్రభుత్వ భూములను దోచిపెడుతున్నారని ఆరోపించగా సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు.

జలసిరి అమలు తీరు అధ్వానం..

జిల్లాలో జలసిరి అమలు తీరు అధ్వానంగా ఉందని ఎమ్మెల్యేలతో పాటు సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సకాలంలో జలసిరి బోర్లు తవ్వి,సోలార్‌కనెక్షన్స్‌ఇచ్చి ఉంటే ప్రస్తుత వర్షభావ పరిస్థితుల్లో రైతులకు ఈ దుస్థితి దాపురించి ఉండదని మునగపాక ఎంపీపీ ఆరోపించారు. జిల్లాలో 7,300బోర్లు మంజూరైతే 1100పాయింట్లను గుర్తించామని, 519 బోర్లు తవ్వగా, 50 బోర్లకు విద్యుత్ కనెక్షన్స్ ఇచ్చారని డ్వామా ఏపీడీ ఆనందరావు వివరించారు. సభ్యులు మాత్రం ఏపీడీ సమాధానం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంకెన్నాళ్లు నీటి సంఘాల కొనసాగింపు..

నీటి సంఘాల కాలపరిమితి పూర్తయి రెండు నెలలు కావస్తున్నా ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నారంటూ జెడ్పీ ప్రతిపక్ష నాయకుడు చిక్కాల రామారావు నిలదీశారు. ఇరిగేషన్‌శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులిచ్చినా ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించగా, ఇరిగేషన్ ఎస్‌ఈ నాగేశ్వరరావు తమకు లిఖితపూర్వకంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. నీరు–చెట్టులో అవినీతి, అవకతవకలు జరుగుతున్నాయని సభ్యులు ఆరోపించారు.



జెడ్పీలో ప్రతిపక్ష నాయకుడు రామారావు

స్ఫూర్తిదాయక కథనాలతో చైతన్య వీచికలు

- పాత్రికేయులకు యూనిసెఫ్ ప్రతినిధి సూచన

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): స్ఫూర్తిదాయక వార్తా కథనాలు రాస్తే యువతకు ప్రేరణ కలుగుతుందని యూనిసెఫ్ ప్రతినిధి ప్రోసున్ సెన్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఒక హోటల్లో మీడియా ప్రతినిధులకు యూనిసెఫ్ ఆధ్వర్యం లో నిర్వహించే వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ‘వార్తల ప్రభావం సమాజంపై ఎంతో ఉంటుంది. ముఖ్యంగా యువత ఈ ప్రభావా ని కి ఎక్కువగా లోనవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని యువత ప్రగతిపై, వారు ఎదుర్కొం టున్న సమస్యల పరి ష్కారంపై ప్రత్యేక కథనాలు ప్రచురించాలి.’ అని కోరారు. చెడు మార్గం లో పయనిస్తే కలిగే నష్టాల గురించి నష్టాల గురించి కథనాలు రాయాలన్నా రు. మీడియాలో బీభత్సకరమైన వార్తలకు ప్రాధాన్యాన్ని తగ్గిం చాలని కోరారు. హింస, దాడులు, క్రైమ్ గురిం చి చాలా తక్కువగా వార్తలను ప్రచురించాలని కోరారు.

పోలీసుల వ్యవ‘సాయం’

పెదబయలు(అరకులోయ): నిత్యం కేసుల, శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే పోలీసు అధికారులు.. పేద రైతులకు చేయూతనందించి దొడ్డమనసు చాటుకున్నారు. రెండు నెలల క్రితం కుమ్మరివీధి గ్రామంలో ఏడుగు రు రైతులకు చెందిన 10 ఎకరాల భూ మిని ట్రాక్టర్ యజమాని సహకారంతో దున్నించిన అధికారులు తాజా గా మరో పది ఎకరాలు దున్నించి తమ శభాష్ అనిపించుకున్నారు.

మండలం లో రూడకోట పోలీస్ హౌట్ పోస్ట్ సమీపంలోని జీలుగులపుట్టు గ్రామానికి చెందిన 10 మంది పేద రైతులకు చెందిన భూమిని పాడేరు సీఐ అప్పలనాయుడు, పెదబయలు ఎస్.రామకృష్ణరావు, రూడకోట ఎస్‌ఐలు రామకృష్ణ, సందీప్ బుధవారం దగ్గరుండి దున్నించారు. చిట్రాయిపుట్టుకు చెందిన ట్రాక్టర్ యజమాని జె.వెంకటరావు సహకారం కోరగా, ఆయన ట్రాక్టర్ అద్దె తీసుకోకుండా ముందుకు వచ్చారు. ఈ మేరకు సీఐ, ఎస్‌ఐలు ట్రాక్టరు అయిన డీజిల్ ఖర్చుతోపాటు, డ్రైవర్ బేటాలు ఇచ్చి.. రెండు రోజులపాటు పదెకరాల మెట్టభూమిని దున్నించి సాయమందించారు.

ప్రేమ, పెళ్లి పేరిట మోసం

- యాసిడ్‌తో దాడి చేస్తానని యువకుడి బెదిరింపు
- సీపీకి బాధితురాలి ఫిర్యాదు



హరీష్ (ఫైల్)



పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదిచ్చిన అనంతరం మాట్లాడుతున్న మాధవి

అల్లిపురం (విశాఖ దక్షిణ) :

ప్రేమ, పెళ్లి పేరిట తనను వంచించిన వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలని సీతంపేటకు చెందిన సీహెచ్ మాధవి అనే మహిళ బుధవారం నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. డైరీఫారానికి చెందిన డుబాకుల హరీష్, సీతంపేటలో తాను చదువుతున్న కళాశాల, ఇంటి వద్దకు వచ్చి ప్రేమిస్తున్నానని, చేసుకుంటే నేన్నే పెళ్లి చేసుకుంటానని వెంట పడేవాడని తెలిపింది. నమ్మించి వెంట తిప్పుకోవడమే కాకుండా సినిమాలు, పార్కులకు తిప్పేవాడన్నారు. ఈ క్రమంలో తాను పూర్తిగా తన వశమై పోయానని, ప్రేమించుకున్నది చాలు ఇక పెళ్లి చేసుకుందామని అడిగితే మాట దాటవేసి తప్పించుకు తిరిగే వాడని పేర్కొంది. మూడ్రోజుల క్రితం డైరీఫారంలో ఉంటున్న హరీష్ ఇంటికి వెళ్లి నిలదీయంగా అతని సోదరుడితో తీవ్రంగా కొట్టారన్నారు. మోజు తీరిపోయిందని, ట్రాప్ చేయ్యాలనుకున్నాను..చేశాను అంతేగానీ నిన్ను పెళ్లి చేసుకోవాలని మాత్రం తనకు లేదని తేల్చేశాడని పేర్కొంది. ఇంటికి వెళ్లగా..మా ఇంటికి వస్తే చంపడం, యాసిడ్ పోస్తానని బెదిరించినట్టు ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని కమిషనర్ టి.యోగానంద్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. స్పందించిన కమిషనర్ ఈ కేసును నగర శాంతిభద్రతల డీసీపీ ఫకీరప్పకు బదిలీ చేశారు. బాధితురాలిని ద్వారకా పీఎస్‌కు పంపించేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

153 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సీతంపేట (విశాఖ ఉత్తర) : ఒకరు చేసే రక్తదానంతో ముగ్గురు ప్రాణాలు నిలబెట్టొచ్చని ప్రిజమ్ కళాశాల కరస్పాండెంట్ డి.సత్య నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో రక్త నిధుల కొరత తీవ్రంగా ఉందని, యువత సామాజిక బాధ్యతగా ప్రతి ఆరు నెలలకు ఓ సారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఏఎస్‌రాజా బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ ఎ.సుగంధి, డాక్టర్లు రాధా రాణి, రవిశంకర్ పర్యవేక్షణలో కళాశాలకు చెందిన 153 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ పి. హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాబాల, యూజీ డైరెక్టర్ సి.హెచ్,గోపాల కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భెల్ సిబ్బందికి పీపీపీ వర్తింపు

తలా రూ. 20 వేల చెల్లింపునకు యాజమాన్యం అంగీకారం



సీఎండీ అతుల్ సోబ్టీతో సమావేశమైన భెల్ గుర్తింపు సంఘం నాయకులు, సంజీవరెడ్డి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ కార్మిక ఉద్యోగులకు 2017 సంవత్సరాని ప్లాంట్ పెర్ఫార్మెన్స్ పే (పీపీపీ)ను అమలు చేశారు. ఈ పథకం కింద రూ.20 వేలు వర్తింప జేశారు. ఢిల్లీ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సంస్థ గుర్తింపు యూనియన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి నేతృత్వంలో యూనియన్ ప్రధానకార్యదర్శి ఉరుకూటి బాబూరావు తదితరులు సంస్థ యాజమాన్యంతో సమావేశమై ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు యూనియన్ అధ్యక్షుడు అలమండ వెంకటేశ్వరరావు తెలిపారు.యాజమాన్యం తొలుత రూ.10 వేల చెల్లింపునకే సిద్ధమైందని, దీనిని యూనియన్ గౌరవ అధ్యక్షుడు తీవ్రంగా వ్యతిరేకించడంతో మళ్లీ జరిగిన చర్చల పర్యవసానంగా రూ.20 వేలు వర్తింపునకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. యాజమాన్యానికి, యూనియన్ గౌరవ అధ్యక్షుడికి యూనియన్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ :

హాకీ టోర్నీ సెమీస్‌లో సాలిగ్రామపురం ఉన్నత పాఠశాలతో సింహాచలం గురుకుల పాఠశాల బీ జట్టు, స్టీల్‌ప్లాంట్ జట్టుతో సింహాచలం గురుకుల పాఠశాల ఏ జట్టు తలపడనున్నాయి. వీబీ నాయుడు స్మారక హాకీ టోర్నీలో భాగంగా ఫ్రెండ్స్ క్లబ్ సంఘం ఆధ్వర్యంలో డీఎస్‌ఏ సహకారంతో విశాఖలోని పాఠశాలల హాకీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో పది జట్లు తలపడనుండగా నాలుగు పూల్స్‌లో పోటీలు నిర్వహించారు. మున్సిపల్ స్టేడియంలో తొలిరోజు జరిగిన ప్రారంభ పోటీలో సింహాచలం గురుకుల పాఠశాల ఏ జట్టు 3–0 గోల్స్ తేడాతో మధురవాడ ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలపై విజయం సాధించింది. స్టీల్‌ప్లాంట్ జట్టు శారధ ఉన్నత పాఠశాలపై 5–0తో పోర్ట్ ఉన్నత పాఠశాల 7–0తో సెయింట్ జూడ్ పాఠశాలపై సింహాచలం గురుకుల పాఠశాల బీ జట్టు యలమంచిలి చైతన్య పాఠశాల జట్టుపై 3–0తో విజయం సాధించాయి. మధురవాడ ఎస్‌ఎఫ్‌ఎస్ 3–1తో నక్కపల్లి ప్రభుత్వ పాఠశాలపైన, యలమంచిలి ప్రభుత్వ పాఠశాల 1–0తో శారద ఉన్నత పాఠశాలపైన విజయం



హాకీలో పోటీపడుతున్న విద్యార్థులు

సాధించాయి. సెమీస్ బెర్త్ కోసం స్టీల్‌ప్లాంట్ జట్టు 6–2తో యలమంచిలి ఉన్నత పాఠశాలపైన, సింహాచలం గురుకుల పాఠశాల ఏ జట్టు నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలపైన విజయం సాధించాయి. పోటీలను మున్సిపల్ స్టేడియంలో జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ ప్రారంభించగా బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ పోలిరెడ్డి, అళ్వార్‌దాస్ విద్యాసంస్థల డైరెక్టర్ రాజేంద్ర, డీఎస్‌డీవో జాన్ గాలియట్, ఫ్రెండ్స్ హాకీ సంఘం ప్రతినిధులు సాయికుమార్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. గురువారం ఫైనల్స్ జరగనున్నాయి.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- జాయింట్ సీపీ నాగేంద్ర కుమార్
- కూచిపూడికి రూ.50వేల వితరణ
- విద్యార్థులకు క్రీడా దుస్తులు
- కంప్యూటర్ పుస్తకాలు పంపిణీ

మధురవాడ (భీమిలి) :

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాకు ఎదగాలని సంయుక్త పోలీస్ కమిషనర్ నాగేంద్రకుమార్ ఆకాంక్షించారు. బుధవారం సాయంత్రం నగరంలోని చంద్రంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ పోలీసు అధికారి టీఎస్ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో క్రీడా కారులకు క్రీడా దుస్తులు, విద్యార్థులకు ప్రాథమిక అంశాలతో కూడిన కంప్యూటర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీపీ హాజరై మాట్లాడుతూ చదువు చెప్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోకూడదని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మనం గట్టిగా ఏది అనుకుంటే కచ్చితంగా ఆ స్థాయికి ఎదుగుతామని, బాగా కృషి చేసి ఉన్నతంగా ఎదగాలని మాజీ పోలీసు అధికారి



మాట్లాడుతున్న జేసీపీ నాగేంద్ర కుమార్

టీఎస్ఆర్ ప్రసాద్, బిల్డర్ కౌశల్య కోరారు. ఈ సందర్భంగా కొంతమంది ప్రొఫెసర్లు తయారు చేసి కంప్యూటర్ ఫండ మెంటల్స్‌కు చెందిన పుస్తకాలు 1200, సముద్రిక సాఫ్ట్‌వేర్ సీఈవో పీటర్ సమకూర్చిన 150మందికి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. బిల్డర్ కౌశల్య, వ్యాపారవేత్త కాశీరావులు రు.25వేల చొప్పున విడివిడిగా కూచిపూడి అభివృద్ధికి, దుస్తులకు విరాళం అందజేస్తున్నట్టు ప్రకటించారు. వారిని అతిథులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ దివాకర్, రామయ్య, హెచ్‌ఎంలు ఎం.రాజబాబు, జయప్రద, పీడీలు రాము, అప్పలరాజు, రాజేశ్వరి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పూసర్ల బాలకృష్ణ, కార్యదర్శి కాండ్రేగుల జగదీష్, తదితరులు

విశాఖ లీగల్ : ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర న్యాయవాదుల పిలుపు మేరకు విశాఖ న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదులంతా మూకుమ్మడిగా విధులకు దూరం కావడంతో కోర్టులు వెలవెలబోయాయి. కక్షిదారులకు అసౌకర్యం కలుగకుండా న్యాయమూర్తులు తగిన ఏర్పాట్లు చేశారు. విధుల బహిష్కరణ గురువారం కూడా కొనసాగుతుందని విశాఖ న్యాయవాదల సంఘం ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు 2012వ సంవత్సరానికి ముందు నమోదైన కేసులు పరిష్కరించాలని ఈనెల 4న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై న్యాయవాదుల సంఘాలు మండిపడ్డాయి. న్యాయస్థానాలు, న్యాయవాదులపై ఒత్తిడి పెరిగితే న్యాయ ప్రక్రియకు నష్టం కలుగుతుందని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పూసర్ల బాలకృష్ణ తెలిపారు. అంతా సహకరించాలని కోరారు.

ఉద్యోగాల పేరిట మోసం

- రూ.కోట్లలో వసూలు చేసిన రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి
- సీపీకి ఫిర్యాదిచ్చిన బాధితులు

అల్లిపురం (విశాఖ దక్షిణ) : ఉద్యోగాల పేరిట తమ వద్ద రూ.లక్షలు దోచుకుని మోసం చేశారని బాధితులు బుధవారం నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గాజువాక/శీలానగర్ పంచవటి క్వార్టర్స్‌లో నివసిస్తున్న, డాక్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగి జాజుల సత్యారావు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ డబ్బు తీసుకుని మోసం చేశారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 200మంది నుంచి రూ.2నుంచి రూ.6లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిపారు. కొంతమంది అభ్యర్థుల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా తీసుకున్నారని, వాటిని తిరిగి ఇవ్వకపోవటంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాటికి హామీగా ప్రామిసరీ నోట్లు, చెక్కులు ఇచ్చినా అవి



సీపీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు



సత్యారావు ఇచ్చిన బ్లాంక్ చెక్కు, ప్రామిసరీ నోట్లు

ఉపయోగపడలేదని వాపోయారు. మోసపోయిన వారిలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారే ఉన్నారని, ఇదే విషయమై 2015లో గాజువాక పీఎస్‌లో ఫిర్యాదు చేశామని, సత్యారావు తనకు శీలానగర్‌లో ఉన్న ఇల్లు కూడా తాజాగా ఖాళీ చేసేశారన్నారు.

తమకు న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదు పరిశీలించిన జాయింట్ పోలీస్ కమిషనర్ డి.నాగేంద్రకుమార్ మరోమారు గాజువాక పీఎస్‌లో ఫిర్యాదు చేయమని సూచించినట్టు బాధితులు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని దుర్గాలాడ్జి వీధికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఆకుల నానాజీ, నాగరత్నంల కుమార్తె రూప శాంభవి (18) మంగళవారం రాత్రి ఉరివేసుకుంది. చదువులో ఒత్తిడిని తట్టుకోలేకే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు అనకాపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. నానాజీ, నాగరత్నంలకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఒక కుమార్తె..పుట్టిన మూడేళ్లకే మృతి చెందగా, తాజాగా శాంభవి ఆత్మహత్యకు పాల్పడడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంకా తామెవరికోసం బతకాలంటూ విలపించారు.



శాంభవి మృతదేహం

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ: తప్పిన ప్రమాదం

తగరపువలస (మధురవాడ) : తగరపువలస హైవేపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆనందపురం వైపు నుంచి తగరపువలస వైపు తొలుత కారు, తర్వాత ఆర్టీసీ బస్సు, వెనుక ట్రాలీలోడుతో వెళ్తున్నాయి. ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ కూడా బ్రేక్ వేయాల్సి వచ్చింది. పరిస్థితి గమనించిన లారీ, ట్రాలర్ డ్రైవర్లు అప్రమత్తం అయ్యారు. ముందు ఉన్న బస్సును గమనించిన ట్రాలర్ డ్రైవర్ బ్రేకు వేసి డివైడర్ మీదకు మళ్లించాడు. దీంతో ట్రాలర్ ముందు బాగం దెబ్బతింది, బస్సును ఢీ కొన్నప్పటికీ డివైడర్ పైకి ఎక్కడం వల్ల ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో బస్సులో సుమారు 15మంది ప్రయాణికులున్నాన్నప్పటికీ అంతా క్షేమంగా బైట పడి ఊపిరి పీల్చుకున్నారు. కార్ డ్రైవర్ సెల్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా బ్రేక్ వేసి పరారయ్యాడన్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.



బస్సును తప్పించబోయి డివైడర్ ఎక్కిన లారీ

వివాదాస్పద స్థలం స్వాధీనం

- 60గజాల స్థలం.. విలువ రూ.20లక్షలు
- భూ పోరాటంలో తనకు దక్కిందన్న బాధితుడు
- రెవెన్యూదంటున్న అధికారులు

ఆరిలోవ (విశాఖ తూర్పు) : మూడోవార్డు పరిధి రవీంద్రనగర్ వెనుక బి.ఎస్.ఆర్ నగర్‌లో ఓ స్థలం వివాదాస్పదంగా మారింది. ఈ స్థలం తనదేనంటూ ఓ వ్యక్తి వేసిన పునాదులను రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో బుధవారం స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వివరాలిలా ఉన్నాయి. భూ పోరాటంలో భాగంగా సుమారు ఎనిమిదేళ్ల క్రితం సీపీఎం ఈ కొండను ఆక్రమించిందన్నది ఆరోపణ. ఆరిలోవ, రవీంద్రనగర, పెదగదిలి, చినగదిలి ప్రాంతాలతో పాటు నగరంలో పలు ప్రాంతాలకు చెందిన పేదలు అప్పట్లో ఇక్కడ 700 పాకలు వేసుకొన్నారు. వారిలో కొందరికి ఇటీవల 296 జీవో ప్రకారం పట్టాలు కూడా మంజూరు చేశారు. ఇదిలా ఉంటే ఇక్కడ ఓ ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం భూ పోరాటం సమయంలో సీపీఎం నాయకులు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన బాధితుడు వరదరాజు

తనకు కేటాయించారంటూ ఇందిరానగర్‌కు చెందిన వరదరాజు ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా ఇటీవల సుమారు 60గజాల స్థలంలో గోడలు కూడా నిర్మించాడు. అయితే ఈ స్థలం సామాజిక అవసరాల కోసం కేటాయించగా, ఆక్రమణకు గురైందని స్థానికులు జీవీఎంసీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదిచ్చారు. దీంతో బుధవారం రూరల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాయి, వీఆర్వోలు వర్మ, సూర్యనారాయణ, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడకు చేరుకొన్నారు. స్థలాన్ని స్వాధీనం చేసుకునే సమయంలో బాధితుల నుంచి ప్రతిఘటన



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎదురవుతుందేమోనని ముందు జాగ్రతగా పోలీసుల సహాయం కూడా తీసుకొన్నారు. ఆరిలోవ ఇన్‌చార్జ్ సీఐ షణ్ముఖరావు, సుమారు 30 మంది సిబ్బందితో ఇక్కడకు చేరుకొన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇక్కడ గోడలు తొలగిస్తున్న సమయంలో బాధితుడు వరదరాజు తరపున కొందరు స్థానికులు అడ్డుకొన్నారు. అయినప్పటికీ ఈ స్థలం రెవెన్యూకి చెందినదని, ఏదైనా ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించండంటూ ఆర్.ఐ రాంబాయి సూచించారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం స్థలం విలువ సుమారు రూ.20లక్షలుంటందని అంచనా. కలెక్టర్ హెచ్చరికల మేరకే తాము చర్యలకు పూనుకున్నామని, ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఆక్రమణదారులు శిక్షార్హులవుతారని పేర్కొంటూ ఇక్కడ హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు.

ప్లాటినం నిరోధక థర్మామీటర్ విలువ?



ఎం. సైదులు
సబ్జెక్టు నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజికల్ సైన్స్
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. థర్మామీటర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
1) సెల్సియస్ 2) ఫారన్‌హీట్
3) కెల్విన్ 4) గెలీలియో

2. ఉష్ణోగ్రతకు S.I. ప్రమాణం ఏది?
1) కెల్విన్ 2) సెల్సియస్
3) ఫారన్‌హీట్ 4) జౌల్

3. సెల్సియస్ స్కేల్‌లో 0°C సరిసమాన విలువ కెల్విన్ స్కేల్‌లో?
1) 273k 2) 273.15k
3) 275.15k 4) 270k

4. సెల్సియస్ స్కేల్, ఫారన్‌హీట్ స్కేల్‌లు ఏ ఉష్ణోగ్రత వద్ద సమానంగా ఉంటాయి?
1) 4° 2) –4° 3) 40° 4) –40°

5. ద్రవ థర్మామీటర్‌ల కంటే వాయు థర్మామీటర్‌లు సున్నితత్వాన్ని కలిగి ఉంటాయి. కారణం?
1) వాయువులు స్వల్ప విశిష్టోష్ణం కలిగి ఉంటాయి
2) వాయువులు అధిక విశిష్టోష్ణం కలిగి ఉంటాయి
3) వాయువులు అధిక వ్యాకోచ గుణకం కలిగి ఉంటాయి
4) వాయువులు తేలికగా ఉంటాయి

6. సెల్సియస్ స్కేల్ ఉష్ణోగ్రతలో వ్యత్యాసం 25°C అయితే, ఫారన్‌హీట్ స్కేల్‌లో ఉష్ణోగ్రత వ్యత్యాసం ఎంత?
1) 25°F 2) 45°F
3) 60°F 4) 70°F

7. సెల్సియస్ స్కేల్ ఉష్ణోగ్రత విలువ 25°C అయితే ఫారన్‌హీట్ స్కేల్‌లో సూచించే ఉష్ణోగ్రత ఎంత?
1) 25°F 2) 45°F
3) 67°F 4) 77°F

8. సెల్సియస్ స్కేల్‌లో పరమ శూన్య ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) –200°C 2) –273.15°C
3) –373.15°C 4) –32°C

9. ఒక థర్మామీటర్‌లో నీటి ఘనీభవన, బాష్పీభవన స్థానాలు వరుసగా 20°C, 150°C. సెల్సియస్ స్కేల్‌లో 60°C ఇస్తే థర్మామీటర్‌లో సమానమైన విలువ ఎంత?
1) 110° 2) 88°
3) 78° 4) 60°

10. ప్లాటినం నిరోధక థర్మామీటర్ విలువ?
1) –200°C నుంచి 1600°C
2) –200°C నుంచి 1200°C
3) –200°C నుంచి 800°C
4) –0°C నుంచి 1200°C

11. 400°C క్రమంలో ఉష్ణోగ్రతలు కొలవడానికి ఉపయోగించే థర్మామీటర్ ఏది?
1) పాదరస థర్మామీటర్
2) ఆల్కహాల్ థర్మామీటర్
3) రేడియేషన్ థర్మామీటర్
4) థర్మోకపుల్ (ఉష్ణయుగ్మ) థర్మామీటర్

12. పాదరస థర్మామీటర్‌ను ఉపయోగించి కొలవగలిగే ఉష్ణోగ్రత విలువ?
1) 260°C 2) 100°C
3) 360°C 4) 500°C

13. ఒక వస్తువు ఉష్ణోగ్రతలోని వ్యత్యాసం – 50°C అయితే, కెల్విన్ స్కేల్‌లో ఉష్ణోగ్రతలోని వ్యత్యాసం?
1) 50K 2) 60K
3) 70K 4) 323K

14. ఉష్ణ వికిరణ తీవ్రతను కొలవడానికి ఉపయుక్తకరమైన పరికరం?
1) స్థిర ఘనపరిమాణ వాయు థర్మామీటర్
2) ద్రవ థర్మామీటర్
3) థర్మోపైల్ 4) పైవేవీకావు

15. సూర్యుడి ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగపడే పరికరం?
1) ప్లాటినం థర్మామీటర్
2) పైరోమీటర్
3) వాయు థర్మామీటర్
4) ఆవిరి పీడన థర్మామీటర్

16. కింది వాటిలో సరైన వాక్యాలు ఏవి?
ఎ) సెల్సియస్ స్కేల్‌లో స్థిర బిందువుల మధ్య విభాగాల సంఖ్య 100
బి) ఫారన్‌హీట్ స్కేల్‌లో స్థిర బిందువుల మధ్య విభాగాల సంఖ్య 180
సి) కెల్విన్ స్కేల్‌లో స్థిర బిందువుల మధ్య విభాగాల సంఖ్య 100
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

17. మానవుని శరీర ఉష్ణోగ్రత?
1) 37°F, 98.4°K, 310°C
2) 37°F, 98.4°C, 98.4°K
3) 37°C, 98.4°K, 310°F
4) 37°C, 98.4°F, 310°K

18. ఉష్ణశక్తికి S.I. ప్రమాణం ఏది?
1) కెలోరీ 2) జౌల్
3) కిలోకెలరీ 4) కెల్విన్

19. ప్రమాణ ద్రవ్యరాశి ఉన్న ఒక పదార్థం ఉష్ణోగ్రతను 1°Cకు పెంచడానికి కావలసిన ఉష్ణశక్తిని ఏమంటారు?
1) విశిష్టోష్ణం
2) మొత్తం శక్తి 3) గుప్తోష్ణం
4) ద్రవీభవన గుప్తోష్ణం

20. సెల్సియస్ స్కేల్‌లో ఉష్ణోగ్రతలో వ్యత్యాసం 10°C అయితే, ఫారన్‌హీట్ స్కేల్‌లో ఉష్ణోగ్రతలోని వ్యత్యాసం?
1) 18°F 2) 21°F
3) 10°F 4) 15°F

21. కింది వాటిలో సరైంది ఏది?
1) α : β : γ = 1 : 3 : 2
2) α : β : γ = 3 : 2 : 1
3) α : β : γ = 2 : 3 : 1
4) α : β : γ = 1 : 2 : 3

22. ఒక వృత్తాకార రాగి బిళ్ల మధ్య భాగంలో రంధ్రం చేశారు. ఈ రాగి బిళ్లను వేడి చేస్తే రంధ్రం వ్యాసం ఏమవుతుంది?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మార్పు ఉండదు
4) పైవేవీకాదు

23. కింది వాటిలో అత్యధిక విశిష్టోష్ణం ఉన్న పదార్థం ఏది?
1) ఇనుము 2) నీరు
3) రాగి 4) పాదరసం

24. గుప్తోష్ణం ప్రమాణం ఏది?
1) cal–gr 2) cal/°c
3) cal/gr 4) పైవేవీకావు

25. కెలోరి మీటర్‌ను సాధారణంగా దేనితో తయారు చేస్తారు?
1) రాగి 2) ఇత్తడి
3) అల్యూమినియం 4) జింక్

26. 1 Cal = ?
1) 4186 J 2) 418.6 J
3) 41.86 J 4) 4.186 J

27. 1 Joule = ?
1) 0.28 Cal 2) 0.32Cal
3) 0.24 Cal 4) 4.2 Cal

28. అత్యధిక ఉష్ణోగ్రతలు కొలవడానికి ఉపయోగించే సాధనం?
1) పైరోమీటర్ 2) థర్మామీటర్
3) బోలోమీటర్ 4) కెలోరీమీటర్

29. కింది వాటిలో ఏ ద్రవ పదార్థాన్ని 4°C నుంచి 0°Cకు చల్లార్చినప్పుడు సంకోచానికి బదులుగా వ్యాకోచిస్తుంది?
1) ఆల్కహాల్ 2) నీరు
3) పాదరసం 4) నూనె

30. నీటిని 0°C నుంచి 10°C వరకు వేడి చేస్తే, దాని ఘనపరిమాణం?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మొదట పెరిగి తర్వాత తగ్గుతుంది
4) మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది

31. ఒక వాయువు సమోష్ణోగ్రతా ప్రక్రియలో స్థిరంగా ఉన్న భౌతిక అంశం ఏది?
1) పీడనం 2) ఉష్ణోగ్రత
3) సాంద్రత 4) 1, 3

32. మంచు ద్రవీభవన స్థానం..?
1) పీడనానికి అనులోమానుపాతంలో ఉంటుంది
2) పీడనానికి విలోమానుపాతంలో ఉంటుంది
3) ఎలాంటి మార్పు ఉండదు
4) పైవేవీ కాదు

33. ప్రెషర్ కుక్కర్‌లో ఆహార పదార్థాలు తొందరగా ఉడుకుతాయి. కారణం?
1) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం పెరగడం వల్ల నీటి మరిగే స్థానం కూడా పెరుగుతుంది
2) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం పెరగడం వల్ల నీటి మరిగే స్థానం తగ్గుతుంది
3) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం తగ్గడం వల్ల నీరు మరిగే స్థానం పెరుగుతుంది
4) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం తగ్గడం వల్ల నీటి మరిగే స్థానం తగ్గుతుంది

34. ఎత్తైన ప్రదేశాల వద్ద ఆహార పదార్థాలు ఉడికించడం కష్టతరం. కారణం?
1) గాలిలో ఆక్సిజన్ తక్కువగా ఉండటం
2) అధిక ఉష్ణశక్తిని అందించడం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం
3) వాతావరణంలో పీడనం తగ్గడం వల్ల మరిగే స్థానం కూడా తగ్గిపోవడం
4) అధిక తేమ కలిగి ఉండటం

35. కింది వాటిలో ఆహార పదార్థాలు ఉడకడానికి అధిక సమయం పట్టే ప్రదేశం?
1) సముద్రమట్టం వద్ద
2) సిమ్లా వద్ద 3) ఎవరెస్ట్ శిఖరం వద్ద
4) ప్రెషర్ కుక్కర్‌లో

36. పరిపూర్ణ కృష్ణ వస్తువు శోషణ సామర్థ్యం విలువ?
1) 1 2) 0
3) అనంతం 4) –1

37. ఒక వస్తువు ఉష్ణోగ్రత 85°C నుంచి 80°C వరకు తగ్గడానికి పట్టే కాలం 5 నిమిషాలు. ఆ వస్తువు 80°C నుంచి 75°Cకు తగ్గడానికి పట్టేకాలం సుమారుగా?
1) 5 నిమిషాల కంటే తక్కువ
2) 5 నిమిషాల కంటే ఎక్కువ
3) 5 నిమిషాలు 4) పైవేవీకావు

38. 30°C వద్ద వాతావరణంలో ఒక వస్తువు 60°C నుంచి 50°C కు చల్లారడానికి 10 నిమిషాలు పట్టింది. 10 నిమిషాల తర్వాత 50°C వద్ద అదే వస్తువు ఉష్ణోగ్రత సుమారుగా?
1) 40°C కంటే తక్కువ
2) 40°C కంటే ఎక్కువ
3) 40°C 4) చెప్పలేం

39. ఉన్ని వస్త్రాలు శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తాయి. కారణం?
1) ఉన్ని.. శరీరంలో ఉష్ణోగ్రతను పెంచుతుంది
2) ఉన్ని అథమ ఉష్ణవాహకం, కాబట్టి శరీరం నుంచి ఉష్ణాన్ని ప్రసారం చేయనీయదు
3) పరిసరాల నుంచి వచ్చే వికిరణ శక్తిని ఉన్ని శోషించుకుంటుంది
4) పరిసరాల నుంచి వచ్చే వికిరణ శక్తిని వ్యతిరేకిస్తుంది

40. కింది వాటిలో ఉష్ణశోషణం లేదా ఉష్ణ ఉద్గారం జరగని ప్రక్రియ?
1) సమ ఘనపరిమాణ
2) సమపీడన 3) సమోష్ణోగ్రత
4) స్థిరోష్ణక

41. కణాల కదలిక వల్ల జరిగే ఉష్ణప్రసారాన్ని ఏమంటారు?
1) ఉష్ణ వహనం 2) ఉష్ణ సంవహనం
3) ఉష్ణ వికిరణం 4) తరంగ చలనం

42. భూమి వేడెక్కడం అనేది ఏ ప్రక్రియకు సంబంధించింది?
1) ఉష్ణ వహనం 2) ఉష్ణ సంవహనం
3) ఉష్ణ వికిరణం 4) పైవన్నీ

43. థర్మాస్ ఫ్లాస్క్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
1) ఆర్కిమెడీస్ 2) ఆల్బర్ట్ ఐన్‌స్టీన్
3) న్యూటన్ 4) జేమ్స్ డీవార్

44. థర్మాస్ ఫ్లాస్క్‌ను బాగా కుదిపితే దానిలో ఉన్న ద్రవం ఉష్ణోగ్రత ఏమవుతుంది?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మార్పు చెందదు
4) ద్రవ స్వభావంపై ఆధారపడి ఉంటుంది

45. వాహనాల్లోని రేడియేటర్‌లో నీటిని శీతలకారిణిగా ఉపయోగిస్తారు. ఎందుకు?
1) స్వల్ప సాంద్రత కలిగి ఉంటుంది
2) అధిక బాష్పీభవన స్థానం కలిగి ఉంటుంది
3) అధిక విశిష్టోష్ణం కలిగి ఉంటుంది
4) సులభంగా లభ్యమవుతుంది

46. ఒక తెల్లని, నునుపు తలం లక్షణం ఏది?
1) ఉత్తమ శోషణం, అథమ పరావర్తనం
2) అథమ శోషణం, అథమ పరావర్తనం
3) ఉత్తమ శోషణం, ఉత్తమ పరావర్తనం
4) అథమ శోషణం, ఉత్తమ పరావర్తనం

47. నీటిని 10°C నుంచి 0°C వరకు చల్లార్చితే, దాని ఘనపరిమాణంలో కలిగే మార్పు?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
4) మొదట తగ్గి, తర్వాత పెరుగుతుంది

48. ఒక పదార్థం ఘనస్థితి నుంచి నేరుగా వాయు స్థితికి మారే ప్రక్రియను ఏమంటారు?
1) ఘనీభవనం 2) నిక్షేపణం
3) ఉత్పతనం 4) ద్రవీభవనం

49. కింది వాటిలో అత్యుత్తమ ఉష్ణవాహకం ఏది?
1) పాదరసం 2) వెండి
3) బెంజీన్ 4) ఇనుము

50. కింది వాటిలో అత్యుత్తమ ఉష్ణ బంధకం ఏది?
1) వెండి 2) చెక్క
3) మానవుని శరీరం 4) వజ్రం

51. శీతాకాలంలో చేతి పంపు గొట్టాల ద్వారా వచ్చే నీరు వెచ్చగా అనిపిస్తుంది. కారణం?
1) మన శరీరం చల్లగా ఉండటం
2) వాతావరణంలో ఉన్న ఉష్ణశక్తిని నీరు గ్రహించడం వల్ల
3) భూమి లోపల ఉష్ణోగ్రతలు బయటి వాతావరణంలో కంటే ఎక్కువగా ఉండటం
4) పైవన్నీ

52. రాత్రివేళలో ఎడారి ప్రదేశాలు భూ ఉపరితలంపై కంటే చల్లగా ఉంటాయి. కారణం?
1) ఇసుక, భూ ఉపరితలం కంటే వేగంగా ఉష్ణ ఉద్గారం చేస్తుంది
2) ఇసుక, భూ ఉపరితలం కంటే వేగంగా ఉష్ణశోషణం చేసుకుంటుంది
3) ఇసుక ఎల్లప్పుడూ చల్లగానే ఉంటుంది
4) 1, 2

53. ఉష్ణోగ్రత పెరిగితే కాంతి వేగం..?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మార్పు చెందదు 4) చెప్పలేం

54. కింది వాటిలో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
1) ఆల్కహాల్ 2) పాదరసం
3) ఈథర్ 4) నీరు

సమాధానాలు

1) 4	2) 1	3) 2	4) 4	5) 1
6) 2	7) 4	8) 2	9) 3	10) 2
11) 4	12) 3	13) 1	14) 3	15) 2
16) 4	17) 4	18) 2	19) 1	20) 1
21) 4	22) 1	23) 2	24) 3	25) 1
26) 4	27) 3	28) 1	29) 2	30) 4
31) 2	32) 2	33) 1	34) 3	35) 3
36) 1	37) 2	38) 2	39) 2	40) 4
41) 2	42) 4	43) 4	44) 1	45) 3
46) 4	47) 4	48) 3	49) 2	50) 4
51) 3	52) 1	53) 3	54) 2	

What is the profession of W?



K.M. Jaya Rao
Subject Expert, Hyderabad.

IBPS RRB Special Reasoning

Model Questions

Directions (Q.No.1-6): Read the following information carefully and answer the questions that follow.

There are eight friends P, Q, R, S, T, U, V and W who live in the same locality in a metropolitan city. Each-person pursues a different profession - Author, Lawyer, Doctor, Engineer, Choreographer, Auditor, Professor & Teacher - but not necessarily in the same order. Each person is adept at playing different musical instruments - Flute, Guitar, Harmonium, Saxophone, Sitar, Tabla, Trumpet and Violin - butnot necessarily in the same order.

i) P, who plays tabla, is neither a Choreographer nor a professor, whereas Q is a Lawyer and plays violin. Engineer plays flute. R plays neither guitar nor flute. S does not play harmonium.

ii) Author plays saxophone. The lady who plays guitar is a renowned doctor.

iii) One who plays harmonium is a teacher whereas T and U play trumpet and saxophone respectively. Neither S nor V is an Engineer nor they play Sitar.

iv) R is neither a Choreographer nor an Auditor.

1. Who among the following is a Teacher?
1) Data inadequate
2) V 3) W 4) R
5) None of these

2. What is the profession of W?
1) Data inadequate
2) Teacher 3) Engineer
4) Professor 5) None of these

3. One who plays tabla is:
1) Auditor 2) Lawyer
3) Choreographer
4) Teacher 5) None of these

4. Which of the following pairs represents the person associated with harmonium and flute respectively?
1) W and V 2) V and W
3) P and R 4) Data inadequate
5) None of these

5. Which of the following is correctly matched?

Person	Instrument	Profession
1) R	Guitar	Professor
2) S	Sitar	Doctor
3) T	Trumpet	Author
4) U	Saxophone	Choreographer

5) None of these

6. Who among the following is Professor?
1) T 2) V 3) W
4) R 5) None of these

Directions (Q.No.7-12): Read the following information fully and answer the questions given below.

Ten friends R, S, T, U, V, M, N, O, P and Q are sitting in two opposite rows, facing each other. Each row has five persons.

- S, who is immediate left of U, is opposite to Q.
- T and N are diagonally opposite to each other.
- V, facing south, is opposite to O who is just next right of M.
- N is immediate right of Q.
- M is at one end of the line.
- P is exactly between N and M in a row.

7. Who is sitting immediate right of O?
1) Q 2) N 3) M
4) P 5) Data inadequate

8. If R shifts to the place of V, V shifts to the place of N, and N shifts to the place of R, then who will be the third to the left of the person opposite to O?
1) Q 2) P 3) V
4) U 5) N

9. Which of the following pair is diagonally opposite to each other?
1) VQ 2) SO 3) RN
4) RM 5) SQ

10. Who is third to the right of S?
1) U 2) T 3) V
4) O 5) M

11. In the original arrangement who is sitting just opposite to N?
1) S 2) R 3) T
4) U 5) V

12. In which of the following combinations is the second person sitting second to the left of the first person?
1) SR 2) NP 3) TV
4) OP 5) RV

Direction (Q.No.13-15): Study the following information to answer the given questions.

In a family of six persons, there are two couples.

The Lawyer is the head of the family and has only two sons - Mukesh and Rakesh - both teachers. Mrs. Reena and her mother-in-law both are Lawyers

Mukesh Wife is a Doctor and they have a son, Ajay.

13. Which of the following is definitely a couple?
1) Lawyer - Teacher
2) Doctor - Lawyer
3) Teacher - Teacher
4) Can't be determined
5) None of these

14. What is the profession of Rakesh's wife?
1) Teacher 2) Doctor 3) Lawyer
4) Can't be determined
5) None of these

15. How many male members are there in the family?
1) Two 2) Three 3) Four
4) Can't be determined
5) None of these

Directions (Q.No.16-20): In each of the questions below, a group of letters is followed by four combinations of digit symbol coded letters, (16), (17), (18), (19) and (20). You have to find out which of the combinations correctly represents the group of letters based on the following digit symbol code and combinations that follow, based on the given conditions.

Letters	P	M	R	E	T	A	H	I	N	J	U	B	K	O
Digits/ Symbols	2	9	%	1	#	8	6	@	3	©	7	4	$	5

Conditions:

i) If the first letter is a consonant and the last letter is a vowel, both are to be coded as Δ

ii) If the first letter is a vowel and the last letter is a consonant both are to be coded as δ

iii) If the first letter as well as last letter is a vowel, then their codes are to be interchanged.

iv) If the first letter as well as the last letter, and the second letter as well as the last but one letter are consonants then the codes for the first letter and the last letter are to be interchanged.

16. EPHABL
1) δ82648 2) δ24688
3) δ26488 4) δ28648
5) δ26848

17. JMEUON
1) 39175© 2) ©17953
3) ©97153 4) ©91753
5) None of these

18. BTJAPK
1) 4#©82$ 2) $#©284
3) $#©824 4) $2©8#4
5) None of these

19. ARKHBU
1) 7 % 6 $ 4 8 2) 7 % $ 6 4 8
3) 8 % $ 6 4 7 4) 7 $ % 6 4 8
5) None of these

20. MTRABU
1) Δ#%84Δ 2) Δ#%48Δ
3) 9#%84Δ 4) Δ#%847
5) None of these

Directions (Q.No.21-22): Each of the questions are below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and Give answer:

1) If the data in statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question
2) If the data in statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone is sufficient to answer the question.
4) If the data in both the statements I and II together are not sufficient to answer the question
5) If the data in both the statements I and II together are necessary to answer the question.

21. On which day was Yasir born? (His date of birth is February 29)
I. He was born between year 2005 and 2011
II. He will complete 4 years on February 29, 2012

22. Out of 64 students 38 play both chess and cricket. How many students play only chess?
I. Out of 64 students, 22 students play any game. 4 students play only cricket.
II. Out of 64 students, 20 are girls and 10 of them don't play any game.

Directions (Q.No. 23-25): Read the following information/ statement carefully and answer the questions.

23. Which of the following expressions follows if the given expression 'A < C ≥ B = D ≤ E' is definitely true?
1) A ≤ D 2) E = C 3) D > C
4) E < B 5) None

24. In which of the following expressions will the expression 'L > P' be definitely false?
1) L > M ≥ N = P
2) P = N ≥ L > M
3) P ≤ M ≤ N < L
4) L > M = N ≥ P
5) All are false

25. Which of the following symbols should be placed in the blank spaces respectively (in the same orderfrom left to right) in order to complete the given expression in such a manner that 'V > Z' definitelyholds true?
V _ W _ X _ Z
1) <, ≤, = 2) >, ≥, <
3) =, <, ≤ 4) >, ≥, >
5) None of these

Key with Explanations

(1-6):

P	Auditor	Tabla
Q	Lawyer	Violin
R	Professor	Sitar
S	Doctor	Guitar
T	Choreographer	Trumpet
U	Author	Saxophone
V	Teacher	Harmonium
W	Engineer	Flute


1) 2 2) 3 3) 1
4) 2 5) 5 6) 4

(7-12):

T	V	U	S	R
↑	↑	↑	↑	↑
M	O	P	Q	N

7) 4 8) 5 9) 4
10) 2 11) 2 12) 2

(13-15):



13) 1 14) 3 15) 2 16) 5
17) 4 18) 3 19) 2 20) 1

(21-22):

21) 3; Yasir was born in the leap year. The leap year between 2005 and 2011 is 2008. Hence, Yasir was born in the year 2008. Hence, I follows.
As Yasir completes 4 years on February 29, 2102, it can be clearly understood that he was born in 2008. Hence, II follows. Hence, either I or II follows.


22) 1; Only I follows.


23) 5; None of the expression follows.

24) 2; P = N ≥ L > M. Hence, P > L is definitely true and L > P is definitely false.


25) 4; V>W≥X > Z. Hence, V > Z

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



నాన్నా చెప్పవా?

నీడలో ఉన్న వస్తువుకి నీడ ఎలా పడుతుంది?



ఏదైనా ఒక వస్తువుపైపడే కాంతి ఆ వస్తువుకు ఉండే భౌతిక స్వభావాన్ని అనుసరించి దాని ద్వారా చొచ్చుకొని పోవడం, వివిధ దిశల్లోకి పరావర్తనం చెందడం, లేదా ఆ వస్తువుచే శోషింప బడడం పీల్చివేయబడడం) జరుగు తుంది. ఆయా వస్తువుల స్వభావాన్ని బట్టి ఈ మూండిట్లో ఏదో ఒకటి జరగ వచ్చు, లేదా ఈ మూడు ప్రక్రియలు వివిధ నిష్పత్తులలో చోటుచేసుకో వచ్చు. ఒక వస్తువు ద్వారా కాంతి ప్రయాణించలేనప్పుడు ఆ వస్తువు తాలూకు నీడ... ఆ వస్తువుపై కాంతి పడిన దిశకు రెండోవైపున పడుతుంది. అయితే సూర్యుడు లాంటి ఒక పెద్దశక్తివనరు నుంచి కాంతి వస్తున్నప్పుడు ఆ కాంతి తావరణంలోనూ, పరిసరాలలోని వివిధ భౌగోళిక స్వరూపాల వల్ల, కృత్రిమ కట్టడాలవల్ల అన్ని దిశలకూ చెదురుతుంది. ఇలా పరిసరాలలోని శిలలు, చెట్టు చేమలు తదితరాల వల్ల చెదిరిన కాంతి 'నీడలో ఉన్న వస్తువు'పై పడినప్పుడు, ఆ వస్తువు కూడా మొదటి వస్తువులాగా కాంతిని తన గుండాపోనివ్వనిది అయినప్పుడు... అప్పటికే నీడలోఉన్న వస్తువుకి కూడా మరో నీడ ఏర్పడుతుంది. అయితే మొదటి వస్తువునీడలాగా ఈ నీడ సాంద్రంగా ఉండక, ఉండీ లేనట్లుగా కనిపిస్తుంది. ఉదాహరణకు మేఘం తాలూకునీడలో ఉండే ఓ పెద్ద బండరాయి పైన,దూరంగా ఉన్న మరో శిలపైన పడిన సూర్యకాంతి పరావర్తనం చెంది పడడం వల్ల, ఆ బండరాయి నీడలో ఉన్నప్పటికీ దానికి మరోనీడ ఏర్పడుతుంది.

మీకు తెలుసా?


పాలపుంత మొదలు నుంచి చివరకు కాంతివేగంతో ప్రయాణించినా లక్ష యేళ్లు పడుతుంది




అమెరికాలో సెలవుల్లో విశ్రాంతి తీసుకోవడాన్ని నామోషీగా భావిస్తారు



స్మార్ట్‌ఫోన్ ఉన్నవాళ్లు ఫేస్‌బుక్‌ను రోజులో సగటున 14సార్లు చూస్తారని సర్వేల్లో తేలింది




రంగులు వేయండి



దారి కనుక్కోండి

కింద ఉన్న కూరగాయ తన స్నేహితుల గుంపు నుంచి తప్పిపోయింది. పాపం! అది తన స్నేహితుల దగ్గరకు వెళ్లడానికి సహాయం చేస్తారా?



సిల్క్ షోయగం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నటి ఐశ్వర్య



హస్తశిలి ఆర్టిజన్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డు వైఎంసీఏ, సింఫొని హాల్ ఏర్పాటు చేసిన సిల్క్ ఇండియా 2017 ఎగ్జిబిషన్‌ను టాలీవుడ్ వర్ధమాన నటి ఐశ్వర్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీరకట్టు మగువ అందానికి మరింత వన్నె తెస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఉంచిన లెటెస్ట్ దుస్తులు, ఆభరణాలు యువతను ఎంతోగానో ఆకట్టుకుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని 12 రాష్ట్రాల్లో తయారీ చేసిన వస్త్రాలు, ఆభరణాలు, గృహాలంకరణాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 28వ వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. - బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు)





మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి గణేశునికి జేజేలు పలుకుదాం.. మీ వీధిలో లేదా ఇంటిలో మట్టి గణనాథుడ్ని ప్రతిష్ఠించి సాక్షి.. ఎస్.ఆర్.ఐటీ. ఇంజనీరింగ్ కాలేజీ అందించే బహుమతిని గెలుచుకోండి. మీరు చేయాల్సిందల్లా మట్టి విగ్రహంతో సెల్ఫీ తీసి **9505504146, 9912199687** నంబరుకు వాట్సప్ ద్వారా పంపండి ఎంపిక చేసిన చిత్రాన్ని సాక్షి ప్రచురిస్తుంది మీ చిరునామా.. మొబైల్ నంబరు తప్పనిసరిగా తెలియజేయండి.

మట్టిమేలు తలపెట్టవోయి

ముగిసిన మారీటైం సదస్సు

విశాఖ సిటీ: తూర్పు నౌకాదళ స్వర్ణోత్సవ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో భాగంగా సాముద్రిక ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగిన మారీటైం సదస్సు బుధవారం ముగిసింది. మాజీ వైస్‌అడ్మిరల్ సతీష్ సోనీ అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సదస్సులో రీజనల్ మారీటైం డైనమిక్స్ అంశంపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కమాండర్ ప్రకాష్‌గోపాల్ మాట్లాడుతూ.. ఇండో–పసిఫిక్ రీజియన్‌లో బలమైన శక్తిగా ఎదిగేందుకు భారత నౌకాదళం అనుసరించాల్సిన వ్యూహాల్ని విశదీకరించారు. నేషనల్ మారీటైం ఫౌండేషన్ మాజీ డైరెక్టర్ వైస్ అడ్మిరల్ ప్రదీప్ చౌహాన్, మాజీ నేవీ చీఫ్ అడ్మిరల్ అరుణ్‌ప్రకాష్ మాట్లాడుతూ సముద్రతీరంలో భారత నౌకాదళం పటిష్టమయ్యేందుకు ఉన్న సవాళ్లు, వాటిని ఎదుర్కోవాల్సిన వ్యూహాలను వివరించారు. మొత్తం 18 మంది అధికారులు ఇండియన్ నేవీ, తూర్పు నౌకాదళం అనుసరించాల్సిన విధానాలు, ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారాలపై చర్చించారు. ఈసమావేశంలో కెప్టెన్ ఎస్ఎస్ పర్మార్, ప్రొ.బ్రహ్మ, మాజీ కమాండర్ ఉదయ్‌భాస్కర్ తోపాటు నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ఈఎన్‌సీ చీఫ్ హెచ్‌సీఎస్ బిస్త్, నౌకాదళ మాజీ అధికారులు



హాజరైన నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులు, సిబ్బంది

విశాఖ క్రైం పోలీసులకు అవార్డులు

అల్లిపురం (విశాఖ దక్షిణ) : పరవాడ ఎస్.ఐ షేక్ షరీఫ్, కానిస్టేబుల్ రవికుమార్‌లకు ఏబీసీడీ అవార్డు లభించింది. ఈ అవార్డును బుధవారం విజయవాడలో డీజీపీ ఎన్.సాంబశివరావు చేతులు మీదుగా అందుకున్నారు. ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్‌లో క్రైమ్ కేసులు డిటెక్షన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ఇస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు అవార్డులను డీజీపీ ప్రకటించారు. వాటిలో పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నంబరు 61/2017లో పరవాడ ఎస్.ఐ షేక్ షరీఫ్, కానిస్టేబుల్ రవికుమార్‌లు చూపిన చొరవకు గుర్తింపుగా రెండవ బహుమతితో పాటు అవార్డును ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డును ఎస్.ఐ షేక్ షరీఫ్‌కు బదులుగా సీఐ పైడపునాయుడు, కానిస్టేబుల్ రవికుమార్‌లు అందుకున్నారు.



డీజీపీ సాంబశివరావు నుంచి అవార్డు అందుకుంటున్న సీఐ పైడపునాయుడు, కానిస్టేబుల్ రవికుమార్



'సాక్షి' ఆధ్వర్యంలో భీమవరంలో

క్షత్రియ వధూవరుల వివాహ పరిచయ వేదిక

భీమవరం : క్షత్రియ వధూవరుల వివాహ పరిచయ వేదిక సెప్టెంబర్ 3వ తేదీన భీమవరంలోని శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి, ఎ.ఎస్.ఆర్.నగర్, భీమవరంలో నిర్వహించనున్నారు. క్షత్రియ సామాజిక వర్గంలో వివాహ సంబంధాలు చూసుకోవడం సులభతరం చేయడానికి ఈ పరిచయ వేదిక మీకు ఎంతో ఉపయోగకరం. తమ పిల్లల వివాహ సంబంధాల కోసం ఈ వేదికలో పాల్గొనే తల్లిదండ్రులు ఆగస్టు 29 లోపు సాక్షి కార్యాలయంలో వధూవరుల వివరాలు, ఫోటోపాటు రూ.1300/–లు చెల్లించి నమోదు చేసుకోవలెను. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి వధూవరుల ఫోటో, వివరాలతో ఉన్న సీడీ అందజేయబడుతుంది. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు 9010203717.

రానున్నది సౌర యుగం

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ నాయక్

విశాఖ సిటీ : రానున్న కాలం సౌర విద్యుత్ యుగమనీ ఈ పరిణామం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనువైన సమయమని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఎంఎం నాయక్ అన్నారు. నగరంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ముంబైకు చెందిన సోలార్ క్వార్టర్ ఆధ్వర్యంలో జరిగిన సోలార్‌రూఫ్–2017 సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎండీ నాయక్ మాట్లాడుతూ.. సోలార్ విద్యుత్‌కు డిమాండ్ పెరగడంతో.. ఏపీఈపీడీసీఎల్ ఆదాయం క్రమేపీ తగ్గుతూ వస్తోందన్నారు. పరిశ్రమలు, గృహ వినియోగానికి సౌరవిద్యుత్ వినియోగంపై ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ మాట్లాడుతూ 140 పాఠశాలల్లో సోలార్ ప్యానెల్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్(ఎలెక్ట్) పరిశ్రమలకు అవసరమైన డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ వనరుగా సౌర విద్యుత్ ఉపయోగపడుతోందన్నారు. సౌర విద్యుత్ కంపెనీలు తమ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ ఛాంబర్ ద్వారా ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమైతే సంపూర్ణంగా సహకరిస్తామని స్పష్టం చేశారు. నెడ్‌క్యాప్ జీఎం కె.శ్రీనివాస్, ఏపీఎస్‌పీడీసీఎల్ జీఎం సుమన్‌కల్యాణి, ఛాంబర్ ఉపాధ్యక్షుడు డా.కుమార్‌రాజా, ఛాంబర్ ప్రతినిధులు జీఎస్‌రావు, ఎం సుధీర్, శ్రావణి, పైడా కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయక్, కమిషనర్ హరినారాయణన్, సాంబశివరావు

గణేశ స్ఫూర్తి మంత్రం

ఇష్టసిద్ధి

అష్టసిద్ధులతో
చిన్నారుల్లో
నవోన్మేషం

వినాయకుడు ముక్కోటి దేవతల్లో పూజలు అందుకునే అగ్రగణ్యుడు. సద్గుణాల రాశి. సర్వ లక్షణ లక్షితుడు. పలు అంశాల్లో మార్గదర్శి. ఆయనలోని విశేష లక్షణాలు బాలలకు అనుసరణీయం. పిల్లలకు వినాయకుడంటే చాలా ఇష్టం. శుక్రవారం వినాయకచవితి సందర్భంగా అష్టగణపతిపై 'సాక్షి' కథనం.

- కంచరపాలెం (విశాఖఉత్తర)

బుద్ధిబలం..



భుజబలం కంటే బుద్ధిబలం మిన్న. ముల్లోకాలను చుట్టివచ్చే విషయంలో వినాయకుడు దీనినే ఉపయోగించాడు. తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణ చేసి కుమార స్వామికంటే మిన్నగా నిలిచాడు. పిల్లలకు ఇదే విషయం చెప్పాలి. ఎలాంటి సమస్యనైనా బుద్ధి బలంతోనే ఎదుర్కోవాలి. చదువుల్లో వెనుకబడితే మందలించడం, కొట్టడం చేయకుండా తెలివిగా ఎలా ముందుకెళ్లాలో పిల్లలకు నేర్పించాలి. ఇష్టపడి చదివితే ఏ మార్గాన్ని ఎంచుకున్నా అవలీలగా విజయం సాధించవచ్చని తెలియజెప్పాలి.

వినమ్రతే ఆభరణం...



లంబోదరుడు సకల విద్యా పారంగతుడు. ముక్కోటి దేవతల్లో మొదటి పూజ తనకే జరుగుతున్నా అహంకరించని తత్వం గణపతిది. తల్లిదండ్రులు, పెద్దలపట్ల వినమ్రత ఆయనకున్న గొప్ప సుగుణం. పిల్లలు కూడా దీనిని అలవరచుకునేలా తల్లులు మార్గదర్శనం చేయాలి. నలుగురు కాస్త పొగడగానే తనంతటి వాడు లేడనే భావన రాకూడదని చెప్పాలి. ఈ భావన వ్యక్తి పురోగతిని అడ్డుకుంటుందని నూరిపోయాలి. ఉన్నత శిఖరాలు ఎన్ని అధిరోహించినా కన్న వారిని, సొంత ఊరిని, దేశాన్ని మరువరాదని హితబోధ చేయాలి.

కళల్లోనూ రాణించాలి...

ఏ రంగంలోనైనా మనకంటూ ప్రత్యేకత ఉండాలి. అప్పుడే గుర్తింపు వస్తుంది. వినాయకుడు అనేక కళల్లో దిట్ట. నాట్య గణపతిగా, సంగీత గణపతిగా, ఇలా వివిధ రకాలుగా కొనియాడతారు. పిల్లలు కూడా చక్కటి ప్రతిభ చాటాలి. సంగీతం, నాట్యం, వాయిద్యాలు, నటన, తదితర రంగాల్లో ఆసక్తి ఉందో గమనించాలి. జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న వారూ చిన్నారులకు ఆదర్శంగా చూపించాలి.



అసాధ్యుడు....



మూషిక వాహనుడు అసాధ్యుడు. ఆయనకు సాధ్యం కానిది ఏదీలేదు. మహా భారతంలోని 18 పర్వాలను ఆగకుండా రాయగలవా అన్న వ్యాసుడికి తానేంటో నిరూపించాడు. బాలలు కూడా దేనినైనా సుసాధ్యం చేయాలి. సవాళ్లను స్వీకరించాలి. ఆ లక్ష్యం చేరే వరకు విశ్రమించకూడదు. చిన్ననాటి నుంచే పిల్లల్లో తల్లులు పట్టుదల అలవరచాలి. అప్పుడే సమున్నత సంకల్పాలు సాకారమవుతాయి. ప్రముఖులు ఆయా రంగాలో సాధించిన విజయాలే ఇందుకు ఉదాహరణగా పిల్లలకు చూపాలి.

అందమూ..ఆరోగ్యం



ఏకదంతుడు చక్కటి రూపవంతుడు చూడముచ్చట గొలిపే ఆకారం ఆయన సొంతం. బాలలను కూడా ఇలాగే పెంచాలి. సరైన వేళకు పిల్లలకు ఆహారం అందించాలి. పౌష్టికాహారం ఎప్పటికప్పుడు ఇవ్వాలి. పిజ్జాలు, బర్గర్ల సంస్కృతికి దూరంగా ఉంచాలి. అలాంటి ఆహారం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్గించాలి. షుగర్, బీపీ, కీళ్ల నొప్పుల బారిన పడుతున్న చిన్నారులు ఎందరో ఉన్నారు. వారి గురించి సున్నితంగా వివరిస్తూనే ఆరోగ్యంపై పిల్లలకు అవగాహన కల్గించాలి. ఆరోగ్యంగా ఉన్నప్పుడే అందం సొంతం అవుతుందని చెప్పాలి.

ప్రకృతి ప్రేమికుడు...

ఏకదంతుడు ప్రకృతి ప్రేమికుడే. ఔషధ గుణాలెన్నో ఉండే పత్రితోనే చవితినాడు మనం పూజిస్తాం. ఈ రహస్యాన్ని తెలియజేయడమే పూజ ముఖ్యోద్దేశం కూడా అందుకే మనం ప్రకృతిని పరిరక్షించాలి. ప్రస్తుతం ఈ స్పృహ లేక ఎన్నో అనర్థాలను ఎదుర్కొంటున్నాం. చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని తెలియజెప్పాలి. ఈ అంశంపై చిత్ర లేఖనం, వక్తృత్వం, వంటి పోటీల్లో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించాలి.



పరాక్రమం..



గణపతి అమిత పరాక్రమవంతుడు. దీని ద్వారానే శిష్టసంరక్షణ చేశాడు. పిల్లలు అలాగే ఉండాలి దేనినైనా ఎదుర్కొగలగాలి. ఆపదలు చెప్పిరావు అవి ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొవాలి. సాహసవంతుల కథలను తల్లులు తరుచూ వినిపించాలి. వారి వల్ల సమాజానికి జరిగిన మేలు విడమరచి చెప్పాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎందరో చిన్నారులు ప్రాణాలకు తెగించి ఆపదలో ఉన్న వారిని రక్షించారు. తద్వారా ఎన్నో కుటుంబాలను నిలబెట్టారు.

సకలశాస్త్ర కోవిదుడు...

వినాయకుడు సకలశాస్త్ర కోవిదుడు. ఆయన స్ఫూర్తిగా పిల్లలూ చదువుల్లో రాణించాలి. కలలు కంటూ వాటిని సాకారం చేసుకునే ప్రయత్నమూ చేయాలి. పలువురు శాస్త్రవేత్తల గురించి చెప్పడం ద్వారా పిల్లల్లో పోటీతత్వం పెంచండి. నేటి చదువు రేపటి భవితకు మేలిమలుపు అనే విషయం మరువకండి.



ఓ మట్టి గణపయ్య..



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి బుధవారం గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. గాయత్రి సంస్థల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల్లో సృజనాత్మకత, ప్రకృతి వనరుల పరిరక్షణ, భారతీయ సంస్కృతి, నాగరికతపై అవగాహన కల్పించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధర రాణి మాట్లాడుతూ పెరిగిపోతున్న రసాయనాలకు వీడ్కోలు పలికి, పర్యావరణానికి మేలు చేసే విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పి.సునీత, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక భావాలు పెరుగుతాయి

మట్టిబొమ్మల తయారీ వలన సృజనాత్మక భావాలు పెరుగుతాయి. కాలుష్య కారకాలపై మార్గంగా వుండడం. వివిధ రసాయనాల వలన జరిగే ప్రమాదాన్ని నివారించవచ్చు. అందుకే ఈ శిబిరంలో పాల్గొన్నారు.

–పవన్, 7వ తరగతి



ప్లాస్టిక్ వద్దు



విశాఖ నగరం శరవేగంలో విస్తరిస్తోంది. ఆధునికత పేరుతో ప్లాస్టిక్ వినియోగానికి అడ్డూ, అదుపు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఈ శిక్షణ శిబిరం నిర్వహించడం చాలా బాగుంది. అందరూ మట్టి వినాయకుడ్ని పూజించాలి.

–సాత్విక, తొమ్మిదో తరగతి

మట్టి ప్రతిమలే ముద్దు



మట్టి ప్రతిమలను అందిస్తున్న సతీష్ పొన్నం

పెదవాల్తేరు(విశాఖ తూర్పు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణనాథ ప్రతిమలకే పూజలు చేయాలంటూ సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ విద్యార్థులు ప్రచారం చేశారు. ఎకో ఫ్రెండ్లీ వినాయక చవతి వేడుకలను అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా శివాజీపాలెంలోని అకాడమీ వసతి గృహంలో మట్టి వినాయక ప్రతిమలను మేజేజింగ్ డైరెక్టర్ సతీష్ పొన్నం ఉచితంగా పంపిణీ చేశారు.

జెండాపై కపిరాజు



పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): రామాయణ, మహాభారత కాలంలో యుద్ధానికి బయలుదేరి వెళ్లే రథాలపై జెండాలు ఎగిరేవి. రథంలో ఉన్న వీరుడి బలానికి, విజయానికి సంకేతంగా జెండాలు ఉండేవి. జెండాపై ఉన్న గుర్తును బట్టి అందులో ఎవరున్నారనే విషయాన్ని ఇతరులు సులభంగా గుర్తుపట్టేవారు. ప్రస్తుతం ఏ వాహనం మీద జెండాలు ఎగరడం లేదు..కాని చేపల వేట నిమిత్తం సముద్రంలోకి వెళ్లే ప్రతి బోటుమీద జెండా, జాతీయ జెండాలు తప్పనిసరిగా ఎగురుతుంది. అంతర్జాతీయ జలాలు, భారతదేశ సరిహద్దు జలాల్లో ఉన్నపుడు భారతీయ కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులు జాతీయ జెండా ద్వారా ఆయా బోట్లు భారతదేశానికి చెందినవని గుర్తిస్తారు. అదేవిధంగా దాదాపు అన్ని బోట్లమీద జాతీయ జెండా, కపిరాజు జెండాలు ఎగురుతూ కనిపిస్తాయి. వీటితో పాటు తమ కుల దైవమైన గంగాదేవితో పాటు ఇతర దేవుళ్ల బొమ్మలు ఉన్న జెండాలను ఎగురుతుంటాయి. వేట చక్కగా సాగాలని, ఎవరి దిష్టి తగలకూడదన్న ఉద్దేశ్యంతో కొంతమంది నలుపురంగు జెండాలను ఏర్పాటు చేసుకుంటారు. అదేవిధంగా ప్రతి బోటుమీద ఎరుపు, తెలుపు, నీలం రంగు బల్బులను రాత్రి సమయంలో వెలిగించి ఉంచుతారు. చీకట్లో బోట్లు ఒక దానికి ఒకటి ఎదురైనా ప్రమాదం జరగకుండా ఉండేందుకు, ఆకాశంలో ఎగిరే విమానాలు దిగువగా వచ్చినపుడు చీకట్లో బోట్లను గుర్తించేందుకు ఎర్రని బల్బు ఉపయోగపడుతుంది. సముద్రజలాల్లో వేట సాగించే సమయంలో దూరంగా ఉన్న బోటు ఎవరిదో గుర్తించేందుకు జెండా ఉపయోగపడుతుందని బోటులో పనిచేసే కళాసీలు చెబుతున్నారు.



వేట చక్కగా జరిగేందుకు ఏర్పాటు చేసుకున్న నలుపు రంగు జెండాలున్న బోట్లు



జెండాలు రెపరెపలాడుతుండగా వేటకు బయలుదేరిన బోటు



బోట్లపై రెపరెపలాడుతున్న భారత జాతీయ పతాకాలు

